Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 101 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 మే 2023 బుధవారం పేజీలు : 4

## హైదరాబాద్‌లో మరో విషాదం..

### నీటి గుంతలో పడి ఆరేళ్ల బాలుడి మృతి

హైదరాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నగరంలో మరో విషాదం చోటు చేసుకుంది. నీటి గుంతలో పడి ఆరేళ్ల బాలుడు మృత్యువాత పడ్డాడు. నగరంలోని జూబ్లీహిల్స్‌లో గల రోడ్ నెం. 45లో ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి వివేక్ అనే ఆరేళ్ల బాలుడు మృతిచెందాడు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్లోని కళాసిగూడలో మౌనిక అనే చిన్నారి నాలాలో పడి మృతిచెందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో విషాదం చోటు చేసుకోవడంతో ఆందోళన రేకెత్తిస్తోంది.



# ఏం చేద్దాం!?

## కారులో ఉందామా? దిగుదామా!?

### కొత్త లెక్కలు కడుతున్న గులాబీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్ : టైమింగ్ విషయంలో పక్కాగా ఉండే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అందుకు భిన్నంగా వ్యవహరించారా? ఎన్నికలకు టైం దగ్గరకు వచ్చేసిన వేళ.. కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాల్ని తాజాగా నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఓపెన్ గానే చెప్పేశారు. తోకలు కత్తిరిం చేస్తానంటూ ఎమ్మెల్యేలకు ఓపెన్ గా వార్నింగ్ ఇచ్చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆయన మాట్లాడిన మాటల తర్వాతే పలువురు ఎమ్మెల్యేల్లో కొత్త తరహా అంతర్మధనం మొదలైనట్లు చెబుతున్నారు. అందరి జాతకాలు తన దగ్గర ఉన్నాయని.. అవినీతి వద్దని చెప్పటమే కాదు.. మీ సిబ్బంది చేసే తప్పులకు సైతం మీరే బాధ్యత వహించాలంటూ సీఎం కేసీఆర్ నోటి నుంచి వచ్చిన మాటలకు పలువురు ఎమ్మెల్యేలు హర్ట్ అయినట్లుగా చెబుతున్నారు. తమ తప్పులకు శిక్ష విధిస్తానని చెబితే బాగుండేదని.. కానీ.. ఎవరో చేసిన తప్పులకు కూడా మీరే బాధ్యులు అన్నట్లుగా మాట్లాడటం సరికాదన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తప్పులు చేసిన వారిని క్షమించనని.. టికెట్లు ఇచ్చే ప్రసక్తే లేదని కుండబద్ధలుకొట్టేసిన గులాబీ బాస్ మాటలతో పలువురు ఎమ్మెల్యేల్లో కొత్త ఆలోచనకు వస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల వరకు వెయిట్ చేసి.. తీరా ఎన్నికల సమయంలో టికెట్లు ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. టికెట్ ఇవ్వకపోవటం అంటే.. తప్పులు చేసినవారిగా ముద్ర పడే ప్రమాదం ఉందని.. అందుకే టికెట్ లేదనిపించుకునే బదులు.. ముందే వెళ్లిపోతే ఎలా ఉంటుందన్న ఆలోచనలు కూడా షురూ అయినట్లు చెబుతున్నారు. పార్టీలో కొనసాగటమా? లేదంటే గులాబీ కారు దిగేసి.. నచ్చిన తోవలో ప్రయాణిస్తే మంచిదన్న యోచనలో గులాబీ నేతలు పలువురు వచ్చినట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత నేపథ్యంలో.. సమీకరణాలు కుదరక.. ఎవరికైనా టికెట్లను రిజెక్టు చేస్తే.. తీవ్రమైన తప్పుడు పనుల కారణంగానే టికెట్లు ఇవ్వలేదన్నప్రచారం జరిగే ప్రమాదం ఉంది. అదే జరిగితే.. తమ రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పడినట్లుగాపలువురు నేతలు భయాందోళనలు చెందుతున్నారు. అందుకే.. కేసీఆర్ రిజెక్టు చేసే వరకు ఉండకుండా.. ముందేగానే పార్టీ నుంచి జంప్ అయిపోతే బాగుంటుందన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.



## అప్పుడేమో రాముడిని.. ఇప్పుడు హనుమంతుడి వంతు: కాంగ్రెస్‌పై మోదీ ఫైర్

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ఇచ్చిన హామీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ఒకప్పుడు రాముడిని బంధించిందని, ఇప్పుడు హనుమంతుడిని కూడా బంధించాలని చూస్తోందని మండిపడ్డారు. విజయనగర జిల్లాలోని హొస్పేటలో మంగళవారం ఆయన బహిరంగసభలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు కాలం చెల్లిందని అన్నారు. సమాజంలో అశాంతిని రేకెత్తిస్తున్న శక్తులన్నింటినీ నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నామని తెలిపారు. ఇందులో కులమతాల ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదులను బుజ్జగించిన చరిత్ర కాంగ్రెస్‌కే చెల్లుతుందని మోదీ విరుచుకుపడ్డారు.




ముంబయి: ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు, రాజకీయ కురువృద్ధుడు శరద్ పవార్ కీలక ప్రకటన చేశారు. పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ముంబయిలో జరిగిన తన ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పవార్ ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయాన్ని ఎన్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా నిరసించారు. మరికొంత మంది అయితే కన్నీరు పెట్టుకున్నారు. తన సమీప బంధువు అజిత్ పవార్.. ఎన్‌సీపీని వీడి భాజపాలో చేరతారనే ఊహాగానాల మధ్య పవార్ ఈ నిర్ణయాన్ని వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, తదుపరి పార్టీ బాస్ ఎవరనే దానిపై స్పష్టత లేదు. ఆ వివరాలు తెలియాల్సి ఉంది. మహారాష్ట్రలో మునుపటి సంకీర్ణ ప్రభుత్వంలో భిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీలను ఒక దగ్గరకు చేర్చిన ఘనత పవార్‌దే ఆయన చొరవ వల్లే కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన కలిసి అధికారాన్ని పంచుకున్నాయి. అయితే, శివసేనలో చీలిక రావడంతో ఆ కూటమి ప్రభుత్వం కూలిపోయింది. అయినప్పటికీ ఆ పార్టీలు మాత్రం ఇప్పటికీ ఒక్కటిగానే ఉన్నాయి. ఇటీవల అజిత్ పవార్ భాజపాకు దగ్గరవుతున్నారనే వార్తలు విపరీతంగా వినిపిస్తున్నాయి. తనకు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేలతో కలిసి కమలం పార్టీ తీర్థం పుచ్చుకుంటారన్నది ఆ వార్తల సారాంశం. వీటిని అజిత్, శరద్ పవార్ తోసిపుచ్చారు. అయితే ఆయన కుమార్తె సుప్రియా సూలే మాత్రం వచ్చే 15 రోజుల్లో దేశ రాజకీయాల్లో రెండు భారీ కుదుపులు సంభవిస్తాయని, ఒకటి దిల్లీలో, ఇంకోటి మహారాష్ట్రలో అని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన గురించి ముందుగా తెలిసే సుప్రియా ఆ మాట అనుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కన్నడీగులు పట్టంగట్టేదెవరికి!?

## ఎస్ఏఎస్ సంచలన సర్వే




కర్నాటకలో మరి కొద్ది రోజులలో అసెంబ్లీకి సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని బీజేపీ శతవిధాల ప్రయత్నం చేస్తోంది. అధికారంలోకి రావాలని కాంగ్రెస్ చూస్తోంది. మూడవ పక్షంగా జేడీఎస్ ఉంది. మొత్తం 224 అసెంబ్లీ సీట్లు ఉన్న కర్నాటకను ఆరు రీజియన్స్ కింద విభజించి చూస్తారు. ఆయా రీజియన్స్ లో ఏ పార్టీకి ఎంత పట్టు ఉంది ఏ సామాజిక వర్గాలు ఏ వైపు ఉన్నాయన్న దాని మీద హైదరాబాద్ కి చెందిన శ్రీ ఆత్మ సాక్షి ( ఎస్ఏఎస్) గ్రూప్ సర్వే సంచలన నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం చూస్తే కన్నడ సీమలో కాంగ్రెస్ కి అనుకూల పవనాలు వీస్తున్నట్లుగా స్పష్టం అయింది. అలాగే 42 శాతానికి పైగా ఓట్ల షేర్ కూడా కాంగ్రెస్ దక్కించుకుని పూర్తి మెజారిటీని సాధిస్తుందని కూడా ఈ సర్వే తేటతెల్లం చేసింది. ఇక ఆరు రీజియన్స్ పరిధిలో చూసుకుంటే ఏ కులం ప్రభావితం చేస్తుంది. ఆయా కులాలు ఎవరి వైపు ఉన్నాయన్న దాని మీద ఈ సర్వే నిశిత పరిశీలన చేసి విశ్లేషించింది. అలా కనుక చూసుకుంటే హైదరబాద్ కర్నాటక రీజియన్ లో లింగాయత్స్ ముస్లిం కురుబ ఎస్సీ హొలేయా ఎస్సీ మాదిగ ఎస్టీ నాయక కులాలు డామినేటింగ్ రోల్ ప్లే చేస్తాయి. ఇక్కడ తాజా ఎన్నికల్లో ఈ సామాజిక వర్గాలు కాంగ్రెస్ వైపు గా ఆకర్షితులు అవుతున్నట్లుగా ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే వెల్లడించింది. అదే విధంగా బీజేపీ ప్రభావం కూడా ఇక్కడ ఉంది. కానీ లీడ్ మాత్రం కాంగ్రెస్ కే ఉంది అని సర్వే స్పష్టం చేస్తోంది. ఇక సెంట్రల్ కర్నాటకలో చూసుకుంటే లింగాయత్ కురుబా ఓబీసీ ఎస్టీ నాయక్డా ఎస్సీ ఆది కర్నాటక లంబానీ ఎస్సీ కులాలు ప్రధానంగా రాజకీయాలను శాసిస్తాయి. ఈ కులాల మద్దతు ఏ పార్టీ వైపు ఉందని అంటే కాంగ్రెస్ కే అని ఈ సర్వే చెబుతోంది. అంటే కాంగెర్స్ లీడింగ్ లో ఈ ప్రాంతంలో ఉంది అని పేర్కొంటోంది అన్న మాట.

అయితే సెంట్రల్ కర్నాటకలో బీజేపీతో కాంగ్రెస్ కి హొరాహొరీ పోరు తప్పదని సర్వే తేల్చి చెబుతోంది. అదే విధంగా ఓల్డ్ మైసూర్ రీజియన్ లో చూసుకుంటే వక్కలింగ ఓబీసీ కురుబ ఓబీసీ ఆది కర్నాటక ఎస్సీ కులాలు ఉన్నాయి. ఇక్కడ కాంగ్రెస్ జేడీఎస్ ల మధ్య భీకర సంగ్రామం జరగబోతోంది అని సర్వే చెబుతోంది. ఇక్కడే జేడీఎస్ కి గట్టి పట్టు ఉదని కూడా తెలుస్తోంది. బెంగుళూరు అర్బన్ రీజియన్ పరిధిలో చూసుకుంటే వొక్కలింగ బ్రాహ్మిన్స్ ముస్లింస్ రెడ్డీస్ కీలక పాత్ర పోషిస్తారు. ఇక్కడ బీజేపీ కాంగ్రెస్ ల మధ్య పోటా పోటీగా సమరం సాగనుంది అని సర్వే చెబుతోంది. కోస్టల్ కర్నాటకలో చూసుకుంటే బ్రాహ్మిన్స్ ఇడుగ తుళు మొగెవీరా ఓబీసీ మైనారిటీస్ ఉంటాయి. ఇక్కడ బీజేపీ లీడింగ్ లో ఉంది అని ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే చెబుతోంది. ఇక్కడ కాంగ్రెస్ తో బీజేపీకి గట్టి పోటీ ఉంటుందని కూడా వెల్లడించింది.

ముంబై కర్నాటకలో చూసుకుంటే లింగాయత్ ముస్లిం కురుబ ఎస్సీ హొలెయా కులాలు ఉన్నాయి. ఇక్కడ కాంగ్రెస్ లీడింగ్ లో ఉంది. బీజేపీ కాంగ్రెస్ ల మధ్య హొరా హొరీ పోరు సాగుతోంది. ఇదిలా ఉంటే ఈసారి వక్కలింగ సామాజికవర్గంలో చీలిక తేవాలని తద్వారా లబ్ది పొందాలని కాంగ్రెస్ బీజేపీ ప్రయత్నం చేస్తున్నాయి. అది ఎంతవరకూ ఫలిస్తుందో చూడాల్సి ఉంది.

# సంపాదకీయం

## కర్నాటక యువత జై కొట్టేది ఎవరికి ?

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఏ వయసు వారు ఏ పార్టీకి ఎంత మద్దతు అన్న దాని మీద హైదరాబాద్ కి చెందిన శ్రీ ఆత్మ సాక్షి గ్రూపు సర్వే పలు విషయాలను వెల్లడించింది. లోతుగా పరిశోధించి మరీ ఈ విశ్లేషణలను అందించింది. కర్నాటకలో ఈసారి కొత్త ఓటర్లు పెద్ద ఎత్తున ఓట్లు వేయబోతున్నారు. ప్రతీ అయిదేళ్ల కు జరిగే ఎన్నికల్లో వారే నిర్ణయాత్మక శక్తిగా ఉంటారు. అలా కనుక చూసుకుంటే ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే చాలా వివరాలని సేకరించింది. 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిని ఒక కేటగిరీగా విభజించి ఈ సర్వే జరిపారు. ఈ కేటగిరీలో చూస్తే బీజేపీకే ఒక శాతం కాంగ్రెస్ కంటే ఎక్కువగా యూత్ జై కొట్టినట్లుగా కనిపిస్తోంది. నలభై ఒక్క శాతం బీజేపీకి నలభై శాతం కాంగ్రెస్ కి యూత్ ఓటేస్తామని చెప్పారు. జేడీఎస్ కి పదహారు శాతం ఇతరుల కు మూడు శాతం ఓట్లు యూత్ నుంచి పడనున్నాయి. ఇక 31 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులని రెండవ కేటగిరీగా చేసుకుని ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే చేసింది. ఈ కేటగిరిలో కొంత అనుభవం గడిస్తారు. అంటే రెండు మూడు సార్లు ఓటేస్తారు అన్న మాట. వారి మనోభావాలు ఎలా ఉన్నాయని చూస్తే కాంగ్రెస్ కి 38 శాతం బీజేపీకి 35 శాతం ఓటేస్తామని చెప్పుకొచ్చారు. అంటే వీరు వేరేగా ఆలోచిస్తున్నారు అన్న మాట. జేడీఎస్ కి 16 శాతం ఇతరులకు పదకొండు శాతం ఓట్లు వీరి నుంచి పడతాయని వెల్లడించింది సర్వే. అలాగే చూస్తే 41 నుంచి 50 ఏళ్ళ మధ్య వయసు గలవారి కేటగిరీని సర్వే చేశారు. వీరిని మధ్య వయస్కులుగా పేర్కొనాలి. వీరు ఉద్యోగ వ్యాపార వ్యవహార బాధ్యతల్తో ఉంటారు. వీరే డిసైడింగ్ ఫ్యాక్టర్ గా కూడా ఉంటారు. ఈ సెక్షన్ ఎటు వైపు మారితే వారిదే విజయం అని చెప్పాలి. మరి ఈ కేటగిరీలో ఏ పార్టీకి మద్దతు ఉంది అని ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే చేసిన విశ్లేషణ చూస్తే కాంగ్రెస్ కి 41 శాతం మంది జై కొట్టారు. అంటే వీరు ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మారాలని గట్టిగా కోరుకుంటున్నారు అన్న మాట. ఇదే కేటగిరీలో బీజేపీకి చూస్తే 34 శాతం మంది మాత్రమే మద్దతు ఇచ్చారు. అంటే కాంగ్రెస్ తో పోలిస్తే చాలా వ్యత్యాసం కనిపిస్తోంది ఇక్కడ. ఇక జేడీఎస్ కి 17 శాతం మంది ఇతరులకు 8 శాతం మంది ఓట్లేస్తామని చెప్పారు. అలాగే 51 నుంచి 60 ఏళ్ల మధ్య కేటగిరీని చూస్తే వీరు పూర్తిగా పొలిటికల్ మెచ్యూరిటీతో ఉంటారు. ఎన్నో ఎన్నికలను చూసిన అనుభవం వీరి సొంతం వీరు కూడా ప్రభుత్వాలను మార్చడంతో అత్యంత ముఖ్య పాత్ర పోషిస్తారు. ఈ కేటగిరీలో 42 శాతం మంది కాంగ్రెస్ కే ఓట్లేస్తామని చెప్పేశారు. బీజేపీకి 35 శాతం జేడీఎస్ కి 16 శాతం ఇతరులకు 7 శాతం మంది ఓట్లేస్తామని పేర్కొన్నారు. చివరిగ 61 ఏళ్ళ నుంచి ఆ మీదట ఉన్న సీనియర్ సిటిజన్ల అభిప్రాయాన్ని ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే సేకరించింది. ఈ వయో వృద్ధులు ఓట్లు ఎటు వైపు అన్నది కనుక చూస్తే 47 శాతం కాంగ్రెస్ కే అని చెప్పేశారు. అంటే వీరంతా పాతతరం వారు. కాంగ్రెస్ కి గట్టి మద్దతుదారులు అన్న మాట. ఈ కేటగిరిలో బీజేపీకి జస్ట్ 27 శాతం మంది మాత్రమే ఓటెస్తామని చెప్పడం విశేషం. ఇక జేడీఎస్ కి 20 శాతం మంది ఇతరులకు ఆరు శాతం మంది ఓట్లేస్తామని స్పందించారు. మొత్తానికి చూస్తే యువతరంలో ఒక్క శాతం కాంగ్రెస్ కంటే బీజేపీకి మద్దతు దక్కింది కానీ మిగ్గిన సెక్షన్లు అన్నీ కాంగ్రెస్ వైపే ఉన్నాయని ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే స్పష్టం చేసింది అన్న మాట.

# కేంద్రం ఆధీనంలో 'ఉపాధిహామీ'




ఆదిలాబాద్ : ఉపాధిహామీ పథకంలో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగిన పథకం ఇకపై కేంద్రం అజమాయిషీలోకి వెళ్లనుంది. కొత్తగా తీసుకొచ్చిన ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) సాఫ్ట్‌వేర్ ఆధారంగా పనులు చేప ట్టనున్నారు. చేపట్టిన పనులకు కేంద్రం కనుసన్నల్లోనే నిధుల చెల్లింపులుండనున్నాయి. ఇకపై అడిగిన కూలీకి పని కల్పించకపోతే సంబంధిత అధికారికి జరిమానా విధించనున్నారు. జిల్లాలో 2,66,735మంది కూలీలు పని చేస్తుండగా ఇందులో పురుషులు 1,36,361 మంది, మహిళలు 1,30,419 మంది, 2.681 మంది దివ్యాంగ కూలీలు ఉన్నారు. పెరగనున్న పారదర్శకత కొత్తవిధానం ద్వారా ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత మరింత పెరిగే అవకాశం ఉంది. గ్రామాల్లో ఇప్పటి వరకు పాత విధానంలో కొనసాగిన పనులు వాటికి సంబంధిం చిన బిల్లులను యుద్ధ ప్రతిపాదికన చెల్లించాలని ఇప్పటికే కేంద్రం మార్గదర్శకాలు జారీచేసింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన సర్వర్ ఉండడంతో అవకాశం ఉన్న పనులు మాత్రమే గ్రామాల్లో చేపడతారు. ఈ కొత్త విధానాన్ని త్వరలోనే అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కొత్త సాఫ్ట్‌వేర్‌పై సిబ్బందికి దశల వారీగా అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామాన్ని ఒక యూనిట్‌గా

ఇప్పటి వరకు ఉపాధి పనులను జిల్లా యూనిట్‌గా నిర్వహిస్తున్నారు. ఇకపై గ్రామాన్ని యూనిట్‌గా చేపట్టను న్నారు. ప్రతి గ్రామంలో కల్పించిన పనుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు ఎవరైనా కూలీ పని కావాలని అడిగిన 14రోజుల్లోగా కల్పిం చాల్సి ఉంటుంది. లేకపోతే నిరుద్యోగ భృతిని చెల్లించాలి. కూలీ నుంచి డిమాండ్ తీసుకున్న అధికారి సకాలంలో పని కల్పించకపోతే ప్రభుత్వం సదరు అధికారికి జరిమానా విధిస్తుంది. ఇలా వసూలు చేసే జరిమానా నుంచి కూలీలకు నిరుద్యోగభృతి చెల్లించనున్నారు. ఉపాధి హామీ పథకంలో 60శాతం నిధులను కూలీలకు, 40శాతం నిధులను మెటీరియల్ కంపోనెంట్‌కు ఖర్చు చేయను న్నారు. ఇప్పటివరకు చాలా రాష్ట్రాల్లో ఈ విధానం అమలవుతోంది. కొత్త సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ

– కల్పన, ఏపీవో, రెబ్బెన ఉపాధి హామీ పథకం నిర్వహణపై గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చింది. దీనిపై ఇప్పటికే జిల్లా కేంద్రం మొదటి విడత శిక్షణ కూడా ఇచ్చారు. వచ్చే నెల 1నుంచి నూతన విధానం అమలు కానుంది.

# కల్లాల నిర్మాణం కథ కంచికేనా?



మెదక్ : : ఉపాధిహామీ పథకంలో అవకతవకలను అరికట్టేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నూతన సాఫ్ట్‌వేర్ ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫార్మటిక్ సెంటర్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌లో రైతులు పొలాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి నిర్మించుకునే కల్లాలకు సంబంధించిన ఆప్షన్‌ను తొలగించారు. దీనితో కల్లాలు నిర్మించుకోవాలనే రైతులకు నిరాశ తప్పడం లేదు. గతంలో పంటలను ఆరబెట్టడానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

చిన్నకోడూరు మండలంలోమండలవ్యాప్తంగా 272 మంది రైతులకు గాను, 155 మంది రైతులు కల్లాలు నిర్మించుకున్నారు. 117 మంది రైతులు కల్లాలను నిర్మించుకోలేదు. 10 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పు కల్లం నిర్మించుకుంటే 60 పని దినాల కూలీలు, మెటీరియల్ కాంపొండు కింద మొత్తం రూ.85 వేలు రైతులకు చెల్లిస్తారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, ఓసీ, బీసీ రైతులకు 90 శాతం చెల్లిస్తారు.కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఆప్షన్ లేదుజాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఎన్ఐసీ అనే కొత్త సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో పంట కల్లాల నిర్మాణానికి సంబంధించిన ఆప్షన్ లేదు. ఇప్పటివరకు చిన్నకోడూరు మండలంలో 155 మంది రైతులు కల్లాలు నిర్మించుకున్నారు. కల్లం నిర్మించుకున్న ప్రతీ రైతుకు బిల్లులు చెల్లించాం.

# దళితబంధుకు అవినీతి చీడ!




ఆదిలాబాద్ : దళితులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకానికి అవినీతి చీడ పడుతోంది. పథకం ప్రారంభంలోనే కొంత మంది నేతల కన్నుపడింది. ఇప్పటికే దళితబస్తీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇప్పిస్తామంటూ ఒక్కో కుటుంబం నుంచి లక్షల రూపాయాలు దండుకున్న నేత లు.. ఈ పథకాన్ని కూడా వదిలి పెట్టెలా లేరు. ఎలాంటి అర్హత, ఆంక్షలు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షల నిధులను అందించి ఆర్థికపరమైన సహకారం అందించాలని నిర్ణయించింది. కాని వారి అమా యకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు మండల, గ్రామస్థాయి నేతలు అందినకాడికి దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా లో 249 యూనిట్లకు గాను 209యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందు లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను అందించేందుకు సర్వంసిద్ధం చే శారు. ఆదిలాబాద్ నియోజక వర్గానికి వంద, బోథ్ నియోజకవర్గాని కి వంద, ఆసిఫాబాద్ 23, ఖానాపూర్ నియోజక వర్గానికి 26 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు గాను రూ.24 కోట్ల 90 లక్షల నిధులను విడుదల చేసింది. ఇప్పటికే అవ గాహన కార్యక్రమాలు, దీనికి సంబంధించి విధి విధానాలను పూర్తి చేసిన అధికారులు, ఎంపికైన లబ్ధిదారులకు దళితబంధు యూనిట్లను మంజూరు చేయనున్నారు. అడిగినంత ఇస్తేనే ఎంపికమొదటి విడతలో ప్రభుత్వం నియోజకవర్గానికి వంద యూనిట్లను మాత్రమే మంజూరు చేసింది. దీంతో దళితబంధుకు భారీగానే డిమాండ్ ఏర్పడింది. ఎలాంటి ఆంక్షలు లేకుండానే ప్రభుత్వం రూ.10 లక్షలు అందించడంతో దీనిపై పేద, దళిత కుటుంబాలు భారీ ఆశలు పెట్టుకున్నాయి. దీంతో అధికార పార్టీ నేతలను ఆశ్రయించడంతో వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని అడిగినంత ఇస్తేనే రైతుబందు పథకానికి ఎంపిక చేస్తామని చెప్పడంతో గత్యంతరం లేక కొందరు లబ్ధిదారులు ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తుంది. మొదట రూ. 50వేలు ఇచ్చి ప్రభుత్వం అందించే రూ.10లక్షల సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాగానే మిగితా రూ.లక్ష ఇవ్వాలని షరతులు విధించారు. కొన్ని మండలా ల్లో నేతలు తెలివిగా ముందుగానే తెల్లకాగితాలపై లబ్ధిదారుల సంతకాలను సేకరించినట్లు తెలుస్తుంది. ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించకుంటే అప్పు కింద రాయించుకుంటామని బెదిరింపులకు దిగారు. బోథ్ నియోజకవర్గంలోని బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ, గుడిహత్నూర్ మండలాల్లో కొంతమంది నేతలు రహస్యంగా లబ్ధిదారులతో ఒప్పందం చేసుకుని వసూళ్లకు ఎగబడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఫ్రీగా రూ.10 లక్షలు రావడం తో లబ్ధిదారులు కూడా ఇష్టంగానే నేతలకు ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. సోషల్ మీడియాలో వైరల్‌దళితబంధు లబ్ధిదారులను కొంత మంది అధికార పార్టీ నేతలు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బోథ్ మండలానికి చెందిన ఓ లబ్ధిదారుడు తన వద్ద నుంచి రూ.లక్షా 50వేలు గ్రామ సర్పంచ్, మరో మండలస్థాయి నేత డి మాండ్ చేశాడంటూ ఫోన్‌లో అధికారులకు ఫిర్యాదు చేయ డంతో అసలు విషయం బయట పడింది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన అధికార పార్టీ నేతలు అప్రమత్తమై ఓ పోలీసు ఉన్నతాధికారికి సమాచారం అందించడంతో సదరు లబ్ధిదారున్ని పోలీసు స్టేషన్‌కు పిలిపించి మందలించినట్లు తెలుస్తుంది. అధికార పార్టీ నేతల పేర్లు మరోసారి బయటపెడితే గంజాయి కేసులో ఇరికించి జైలుకు పంపుతానని బెదిరింపులకు దిగినట్లు లబ్ధిదారులు కన్నీరు మున్నీరయ్యాడు. పోలీసుల అండ దండలతోనే రెచ్చిపోతూ కొందరు పథకాల అమలును పక్కతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బోథ్ నియోజకవర్గంలోనే గతంలో కల్యాణలక్ష్మి పథకంలో అవకతవకలు జరిగినా.. నామమాత్రంగానే చర్యలు తీసుకోవ డం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్లు విమర్శలున్నాయి. నేతల ఒత్తి ళ్లతోనే పోలీసులు తలొగ్గారన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే ఎన్నో ఆరోపణలున్న కొంతమంది మండల స్థాయి నేతలపై చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్దాయన ఆశీస్సులు ఉన్నాయన్న టాక్ జోరుగా వినిపిస్తోంది.నేతలు అక్రమాలకు పాల్పడినట్లు మా దృష్టికి రాలేదు: శంకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆదిలాబాద్‌దళితబంధు పథకంలో కొంతమంది నేతలు అక్రమాలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలు మా దృష్టికి రాలేదు. ఏదైనా ఫిర్యాదు వస్తే పరిశీలించి చర్యలు తీసు కుంటాం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ఈపథకం మంజూరీకి లబ్ధిదారులు ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. మా దృష్టికి తెస్తే చర్యలు తీసు కుంటాం. జిల్లాలో మంజూరైన 249 యూనిట్లకు గాను 209 యూనిట్ల ను గ్రౌండింగ్ చేస్తున్నాం. మిగితా 40 యూనిట్లు త్వరలోనే అందజేస్తాం. ఎక్కువ గా రవాణా సంబంధిత వాహనాలను లబ్ధిదారులు ఎంచుకుంటున్నారు.

# దర్జాగా..కబ్జా..!

మంచిర్యాల : బెల్లంపల్లి పట్టణంలో భూ కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఎక్కడ ప్రభుత్వ, సింగరేణి లీజు భూములు కనిపించినా రాత్రికి రాత్రే అక్కడ కబ్జాదారులు పాగా వేస్తున్నారు. ఈ తతంగం అంతా ప్రజాప్రతినిధులు, దళారుల కనుసన్నల్లోనే సాగుతోంది. ఇప్పటికే పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ, షంషీర్‌నగర్, అంబేడ్కర్ నగర్ బస్తీ, పాలిటెక్నిక్ ఏరియా, ఇందిరమ్మకాలనీ, రవీంద్రనగర్‌లలో ఖాళీ ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి.

చెరువు కట్టను ఆనుకొని..తాజాగా పట్టణంలోని 3, 17, 19 వార్డుల పరిధిలోని షంషీర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, బెల్లంపల్లి బస్తీ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. వారం రోజుల నుంచి ఇక్కడ ఉన్న ఖాళీ భూమిలో ఉన్న చెట్లను తొలగించి కబ్జాదారులు చిన్న పందిర్లు, గుడారాలను ఏర్పాటు చేశారు. పోచమ్మ చెరువుకట్ట పక్కనే పదుల సంఖ్యలో ఆక్రమణలు వెలిశాయి. ఓపెన్ జిమ్ పక్కన ఉన్న ఖాళీ భూమిపై కూడా కబ్జాదారులు కన్నేసి ఆక్రమించడానికి యత్నాలు చేస్తున్నారు. వీరంతా షంషీర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, బెల్లంపల్లిబస్తీలో శాశ్వత నివాసాలు ఉన్నవారేననే విమర్శలున్నాయి. వారి వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత వార్డు కౌన్సిలర్లు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అనుమానాలు



వ్యక్తం అవుతున్నాయి. బెల్లంపల్లి ఆవిర్భావం నుంచి ఇక్కడ ఖాళీ ప్రభుత్వ భూములు ఎకరాల్లో ఉన్నాయి. క్రమంగా నకిలీ ధ్రువపత్రాలు చూపి చాలా మంది కబ్జాలకు పాల్పడతున్నారు. కొందరు ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి వారికి అనుకూలంగా పత్రాలు తెచ్చుకుని రెవెన్యూ, బల్దియా, పోలీసు అధికారులనే ముప్పు తిప్పలు పెడుతున్నారు. దీంతో ఇలాంటి అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు.

ఏడుగురి మీద కేసులు నమోదు చేశాం– జి. కుమారస్వామి, తహస్మీల్దార్, బెల్లంపల్లి

పోచమ్మ చెరువుకట్ట పక్కన ప్రభుత్వ భూమి కబ్జా గురించి వచ్చిన సమాచారంతో వెళ్లి కొన్నింటిని తొలగించాం. ఇప్పటికే ఏడుగురు వ్యక్తుల మీద కేసులు నమోదు చేశాం. వీటిని పూర్తిగా తొలగించి భూమికి రక్షణ ఏర్పాట్లు చేస్తాం. పోలీసు రక్షణ కోసం ఏస్మీప్మీకి లేఖ రాశాం. తగిన భద్రతతో వెళ్లి పూర్తిగా ఆక్రమణలను తొలగిస్తాం. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం.

# యువతరం మత్తుకు బానిసవ్వొద్దు

నిర్మల్ : దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన యువతరం తాత్కాలిక ఆనందాన్నిచ్చే మత్తుకు బానిసవ్వొద్దని ధర్మప్రసార రాష్ట్ర సహ ప్రముఖ్ మధురనేని సుభాశ్‌చందర్ అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శ్రీ వీరహనుమాన్ విజయ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం మత్తు పదార్థాలకు కేంద్రంగా మారిందన్నారు. నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అనుక్షణం తమ



పిల్లల పట్ల జాగరూకతతో ఉండాలని, చెడు అలవాట్లకు బానిసల వకుండా సంరక్షించాలని సూచించారు. అనంతరం భారీ అంజన్న విగ్రహాన్ని ప్రత్యేకంగా ముస్తాబుచేసిన వాహనంలో ఉంచి పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ముఖ్య అతిథిగా ఐఎంఏ అధ్యక్షుడు ఉదగిరి రామకృష్ణ, న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు షేర్ నరేంద్ర, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఉదారత..: బాగులవాడకు చెందిన కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ యాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు, యువకులు, పోలీసు సిబ్బందికి భోజన పొట్లాలు, మంచినీళ్లు, పండ్లు పంపిణీ చేశారు.

# ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు

ఆసిఫాబాద్ : ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఇటీవల పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనపై నిఘాను పటిష్టం చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.జిల్లాలో 20 పీహెచ్‌సీలుజిల్లాలో మొత్తం 20 పీహెచ్‌సీలు ఉన్నాయి. రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా 108 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఆస్పత్రులలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరై మెరుగైన వైద్య సేవలందించడానికి సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. ఆస్పత్రుల్లో వైద్యుడు ఉండే గదిలో సీసీ కెమెరాతో పాటు బయోమెట్రిక్ యంత్రాన్ని అమర్చనున్నారు. వైద్య పరీక్షలు చేసే గది, రోగులు చికిత్స పొందుతున్న వార్డులలో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా రోగుల తాకిడి ఎలా ఉంది తదితర అంశాలను జిల్లా కేంద్రం నుంచే పరిశీలించడానికి వీలుంటుంది. ఇక దుమ్మాలకు చెక్‌ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ యంత్రాల ఏర్పాటుతో ఇక దుమ్మాలకు చెక్ పడనుంది. జిల్లాలో ఏజెన్సీ మండలాలు అధికంగా ఉన్నాయి. వైద్యులు, వైద్య సిబ్బంది తమతమ విధులకు సకాలంలో హాజరు కారని ఆరోపణలు కూడా ఉన్నాయి.

# స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ షురూ..!

మహబూబాబాద్ : లే-అవుట్ అనుమతిలేని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో మూడేళ్ల కిందట ఇచ్చిన దరఖాస్తుల్లో కదలిక ప్రారంభమైంది. క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సుమారు 23 వేల మంది దరఖాస్తుదారులకు ఉపశమనం కలగనుంది. స్థల యాజమానులకు ఎదురయ్యే వివిధ సమస్యలు తొలగిపోవడంతో పాటు పురపాలక సంఘాలకు సుమారు రూ. 10 కోట్ల ఆదాయం సమకూరనుంది. అక్రమ లే-అవుట్లతో ప్రభుత్వానికి గండి పడిందనుకున్న ఆదాయాన్ని ఏదో రూపంలో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు రకాలుగా రుసుం విధించడంతో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో క్రమబద్ధీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. స్థల యాజమానుల ఆందోళన, అధికార పార్టీ, వివిధ రాజకీయ పార్టీల ఒత్తిళ్ల మేరకు మూడేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్న స్థలాల క్రమబద్ధీకరణ అంశంపై పురపాలక సంఘాలకు రాష్ట్ర పురపాలక శాఖ మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో ఆ దరఖాస్తులకు మోక్షం లభించనుంది.



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం రెండుసార్లు అవకాశం కల్పించింది. మొదటిసారిగా 2016లో స్థలాల క్రమబద్ధీకరణ ద్వారా పురపాలక సంఘానికి రూ. 4 కోట్ల ఆదాయం సమకూరింది. మళ్లీ తర్వాత రెండోసారి 2020 అక్టోబర్ 31 వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో వేలాది దరఖాస్తులు వచ్చాయి. రెండేళ్లుగా స్థలాల క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులకు పురపాలక కార్యాలయాల నుంచి సమాచారం వెళ్లడంతో వారిలో ఉత్సాహం నెలకొంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి- నవీన్, టీపీవో, మహబూబాబాద్ నిబంధనల మేరకు స్థలాల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ భూమి, ఎఫ్‌టీఎల్, శిఖం భూములు ఉంటే వాటిని తిరస్కరిస్తాం. అధికారులను మాత్రమే సంప్రదించి స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి.

# తీరనున్న ఆచార్యుల కొరత.. మెరుగవనున్న వైద్య సేవలు

గోదావరిఖని పట్టణం: గోదావరిఖనిలోని బోధనాసుపత్రుల్లో ఆయా విభాగాల్లో ఆచార్యుల కొరత తీరనుంది. రాష్ట్ర వ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో 1,442 మంది సహాయక ఆచార్యుల(అసిస్టెంట్ ప్రొఫెసర్) పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఇప్పటికే పనిచేస్తున్న 210 మంది సహాయక ఆచార్యులకు సీనియారిటీ ప్రతిపాదికన సహ ఆచార్యులు(అసోసియేట్ ప్రొఫెసర్లు)గా, సహ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న 67 మందికి ఆచార్యులు (ప్రొఫెసర్లు)గా పదోన్నతులు కల్పించనున్నారు. దీంతో సహాయ ఆచార్యులతో పాటు సహాచార్యులు, ఆచార్యుల పోస్టులు సైతం భర్తీ కానున్నాయి. సహాయ ఆచార్యులుగా ఎంపికై వారి జాబితాను ఈ నెల 30న ప్రకటించనున్న ప్రభుత్వం మే 5న నియామక ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇప్పటికే బోధనాసుపత్రుల్లో దాదాపుగా నర్సింగ్ సిబ్బంది నియామకం పూర్తి కాగా, తాజాగా ఆచార్యుల నియామకం పూర్తి కానుండడంతో ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి.

60:40 నిష్పత్తిలో నియామకం

బోధనాసుపత్రుల్లో సహాయక ఆచార్యుల పోస్టులను 60 శాతం నేరుగా, మిగిలిన 40 శాతం పోస్టులను వైద్య విధాన పరిషత్తు, వైద్య ఆరోగ్య శాఖ నుంచి వచ్చే వైద్యులతో భర్తీ చేయనున్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు బోధనాసుపత్రులు వైద్య విధాన పరిషత్తు, వైద్య ఆరోగ్య శాఖ అధీనంలో పనిచేసేవి. ప్రస్తుతం ఆయా ఆసుపత్రులను ఆయా ప్రాంతాల్లోని వైద్య కళాశాలలకు అనుబంధంగా పడకల స్థాయిని పెంచుతూ బోధనాసుపత్రిగా వైద్య విద్య అధీనంలోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వైద్య విధాన పరిషత్తు, వైద్య ఆరోగ్య శాఖ కింద ఉన్న ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులను సైతం వైద్యవిద్య విభాగంలోని బోధనాసుపత్రులోకి తీసుకోవాల్సి ఉంది. దీంతో గోదావరిఖనిలో మొత్తం 154 సహాయక ఆచార్యుల పోస్టులుండగా సుమారు 92 పోస్టులను నేరుగా, మిగిలిన 62 పోస్టులను వైద్య విధాన పరిషత్తు, వైద్య ఆరోగ్య శాఖ నుంచి వైద్య విద్య విభాగంలో విలీనమయ్యే వైద్యులతో పూరించనున్నారు. మొత్తం 154 సహాయక ఆచార్యుల్లో 21 మంది నాన్ క్లీనికల్ విభాగానికి చెందిన వారు కావడంతో వారు కేవలం కళాశాలలో తరగతులు బోధించనుండగా మిగతా వారు క్లీనికల్ విభాగంలో కళాశాలతో పాటు సార్వజనిక ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది.

త్వరలోనే పోస్టుల భర్తీప్రస్తుతం గోదావరిఖని ఆసుపత్రిలో సీటీ స్కానింగ్ యంత్రం ఉన్నప్పటికీ ఆచార్యుల కొరతతో వినియోగంలోకి తీసుకురాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విభాగంలో ఒక్క ఆచార్యులు, ఇద్దరు సహ ఆచార్యులు, ఐదుగురు సహాయక ఆచార్యులుండాల్సి ఉండగా ఒకే ఒక్క సహాయక ఆచార్యులు పనిచేస్తున్నారు. ఆర్థో విభాగంలో మొత్తం 9 పోస్టులకు గాను ఒకే ఒక్క సహాయక ఆచార్యులు పనిచేస్తున్నారు. త్వరలోనే పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో వైద్యుల అందుబాటులోకి వస్తే వైద్యసేవలు మెరుగవ్వనున్నాయి.మంజూరు 248 ... భర్తీ అయినవి 19గోదావరిఖనికి ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరుతో పాటు ప్రాంతీయ ఆసుపత్రిని బోధనాసుపత్రిగా వైద్య కళాశాలకు అనుబంధంగా ప్రకటించిన ప్రభుత్వం ఆయా విభాగాల్లో పోస్టులను మంజూరు చేస్తూ 2021లో జీవో జారీ చేసింది. దీని ప్రకారంగా గోదావరిఖనిలో 42 మంది ఆచార్యులు, 52 మంది సహ ఆచార్యులు, 154 మంది సహాయక ఆచార్యులు మొత్తం 248 మంది ఆచార్యులతో పాటు ఇతర వైద్య, వైద్యేతర, ఉద్యోగులను కలిపి మొత్తం 848 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. నియామక ప్రక్రియ లేకపోవడంతో గోదావరిఖని వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో కేవలం 11మంది ఆచార్యులు, ముగ్గురు సహ ఆచార్యులు, 5 సహాయక ఆచార్యులు పనిచేస్తున్నారు. వివిధ విభాగాల్లో సిబ్బంది నామమాత్రంగానే ఉన్నారు.

# కొలువుల పేరిట వంచన



కరీంనగర్: యువత అమాయకత్వమే ఆసరాగా కొందరు మోసగాళ్లు బరితెగిస్తున్నారు.. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నవారే లక్ష్యంగా కొత్త మోసాలకు తెరతీస్తున్నారు. ఉద్యోగం వచ్చి ఒళ్లో వాలుతుందని ఊరిస్తూ అందినకాడికి డబ్బుల్ని దండుకుంటున్నారు.. తేరుకున్న బాధితులు ఆలస్యంగా ఠాణా మెట్లెక్కుతున్నా.. చెల్లించిన మొత్తం చేతికి రాక బోరుమనడం తప్ప ఇంకా ఏమి చేయలేమని ఆవేదన చెందుతున్నారు..ఆన్‌లైన్‌లో అప్రమత్తత అవసరం ఆన్‌లైన్‌లో కనిపించిన కొలువు కోసం అన్వేషించే విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలి. ప్రకటనలు, సందేశాలు, లక్షల్లో వేతనాలని కనిపించే ప్రతి వెబ్‌సైట్‌ను గుడ్డిగా నమ్మొద్దు. ఎక్కువ శాతం నకిలీవే ఉంటాయని గుర్తుంచుకోవాలి. సైబర్ నేరగాళ్లు వేర్వేరు ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నవారి నంబర్లని సేకరించుకుని లైన్‌లోకి వచ్చి మోసగిస్తారు. ఫలానా సంస్థలో, కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యారని ఫార్మాలిటీ ఛార్జీలను చెల్లించేలా తెలివిగా వ్యవహరిస్తూ బోల్తా కొట్టిస్తారు. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు అందించే ఏ సంస్థ కూడా ముందుగా డబ్బులు చెల్లించమని అడగదనే విషయాన్ని గుర్తించాలి. ముందస్తుగా శిక్షణ ఇప్పించి.. ఆ వెంటనే ఉద్యోగాలిస్తామని మభ్యపెట్టే బోగస్ సంస్థల విషయంలో కచ్చితంగా జాగ్రత్తపడాలి.

ముందస్తు నిఘా ఏది..?

ఏదైనా వ్యాపారం చేసే ముందు విధిగా స్థానిక పురపాలిక అనుమతిని తప్పకుండా తీసుకుంటారు. అయితే ఎక్కడపడితే అక్కడ శిక్షణ సంస్థలు, కన్సల్టెన్సీలు, ఇతరత్రా పేర్లతో ఏర్పాటవుతున్న వాటిపై పోలీసులు సహా ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ ఏ జిల్లాలో ఉండటం లేదు. బాధితులు ఫిర్యాదిస్తేనే వాటిని మూసివేయిస్తున్నారు. అంతేకాని అలాంటి సంస్థలు మళ్లీ ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల ఫిర్యాదులు అందుతున్నా. ఆ సంస్థల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎక్కడ కొత్త బోర్డులతో సంస్థలు నడుస్తున్నాయి? వారు ఏమి వ్యాపారాన్ని సాగిస్తున్నారనే కనీస పర్యవేక్షణను పోలీసులు, రెవెన్యూ, బల్దియా, కార్మికశాఖ అధికారులు కొనసాగించకపోవడంతో ఇబ్బంది నెలకొంది.పోలీసుల సూచనలిలా..! ప్రభుత్వ, ప్రైవేటు ఏ కొలువుకైనా డబ్బులు చెల్లించాలనే ఆలోచన యువత సహా వారి తల్లిదండ్రుల్లో రావద్దు.!కొందరు అమ్మానాన్నలకు తెలియకుండా తెలిసినవారి ద్వారా డబ్బులిచ్చి మోసపోతున్నారు. ఇలా చేయకూడదు. పెరిగిన సాంకేతికత పట్ల అవగాహన ఉండాలి. ఎక్కడా మన వివరాల్ని పూర్తిగా ఇచ్చి ఆపదలో పడొద్దు.! ధైర్యంగా తమకు జరిగిన నష్టాన్ని పోలీసులకు చెప్పే సాహసం చేయాలి. ఇతరులు మోసపోకుండా చూడాలి. ఉద్యోగాల పేరిట ఆన్‌లైన్‌లో మోసం జరిగితే సైబర్ క్రైం సహాయ నంబరు 1930కి ఫోన్ చేసి సమాచారమివ్వాలి. తెలిసిన వారేనని సులభంగా నమ్మి మోసపోవద్దు. వారు పేర్కొన్న సంస్థ విశ్వసనీయత.. ఎన్ని రోజుల నుంచి ఉంది.. ఎంతమందికి ఉపాధి చూపించింది క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఓ సంస్థలో ఉద్యోగమిస్తామని తన నుంచి రూ.6,500 కట్టించుకున్నారని.. తరువాత గొలుసు విధానంలో మరో ముగ్గురిని చేర్పిస్తే రూ.1,000 లాభం ఇస్తామని మోసగిస్తున్నారని.. ఇంట్లో వాళ్లకు చెప్పకూడదని తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఓ యువతి మూడు రోజుల కిందట పోలీసులకు ఆశ్రయించింది. ఆమెలాగే మరికొందరు మంది మోసపోయారని గుర్తించిన పోలీసులు ఆ సంస్థ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. పెద్దపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసే విద్యుత్తు ప్లాంట్‌లో పొరుగు సేవల ఉద్యోగాలున్నాయని పలు పత్రికల్లో ప్రకటనలు వేసి మోసగించిన ఘటన బాధితుల్ని బోరుమనేలా చేసింది. ఐదంకెల మంచి వేతనమని నమ్మబలకడంతో ముందస్తుగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ముట్టజెప్పి మోసపోయిన వారి సంఖ్య అధికంగానే ఉంది. మింగలేక కక్కలేక అనేలా వీళ్ల పరిస్థితి మారిపోయింది. నకిలీ అపాయింట్‌మెంట్స్ అందించడం ఈ మోసంలో కొసమెరుపు.పార్ట్‌టైమ్ జాబ్‌ల పేరిట పలువురిని మోసగించిన ఉదంతాలు తరచూ జగిత్యాల, గోదావరిఖనిలో వెలుగులోకి వస్తున్నాయి. రూ.1000 నుంచి రూ.1999 చెల్లించి పేరు నమోదు చేసుకున్న వారికి ఈ అవకాశమని చెప్పి.. తరువాత బిచాణా ఎత్తేస్తున్న చిన్నాచితక సంస్థలు ఎన్నో. ఫిర్యాదు చేసి తామెందుకు నలుగురిలో నవ్వులపాలవ్వాలనే భయంతోనే చాలామంది ఠాణా మెట్లెక్కకుండా మిన్నకుంటున్నారు.మూణ్నెళ్ల కిందట ఓ ప్రైవేటు సంస్థలో ఏడాదికి లక్షల వేతనం ఉంటుందని నమ్మించి కరీంనగర్ శివారులోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో డబ్బులు కట్టించుకున్న ముఠాను వరంగల్, హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు మొదలు రూ.లక్ష వరకు అందినకాడికి ఆ ముఠా సభ్యులు దండుకున్నారు. కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు చెందిన యువత ఇలా ఉద్యోగం వస్తుందని నమ్మి అమాయకంగా మోసపోయారు. ఒకిరిని చూసి ఇంకొకరు ఈ మాయలో పడ్డారు.కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి వరంగల్ జిల్లాకు చెందిన కొందరు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికారు. కుదర్చుకున్న ఒప్పందంలో భాగంగా ముందుగా రూ.74 వేలు చెల్లించినా ఉద్యోగం ఊసేలేదు. అతను నిలదీయడంతో ఉద్యోగం రాకుంటే డబ్బులు ఇచ్చేస్తామని నమ్మించి బాండ్ పేపర్ రాసిచ్చారు. కొన్నాళ్లకు ఇతనితోపాటు పదుల సంఖ్యలో నిరుద్యోగుల్ని మోసగించి ఉడాయించారని తెలియడంతో బాధితుడు లబోదిబోమన్నాడు.

# మార్కెట్లు దూరం.. రవాణా భారం



జయశంకర్ : జిల్లాలో సింగరేణి, జెన్‌కో వంటి పరిశ్రమలు న్నా వ్యవసాయమే ప్రధాన జీవనాధారం.. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. వరి ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్య ంలో కొనుగోలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ ప్రభుత్వ అనుమతుల మేరకు మొక్కజొన్నను కొంటోంది. కానీ, మిగతా పంట విక్రయానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట విక్రయాలకు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో రవాణా భారం రైతన్నలపై పడుతోంది. జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా మిర్చి, పత్తి 90 వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. కానీ, సరైన మార్కెట్ లేక పంట విక్రయాలకు రైతులు అవస్థ పడుతున్నారు. రవాణా భారం అధికంగా పడుతోంది. జిల్లాలోని కాటారం, మహదేవపూర్, పలిమెల ప్రాంతాల నుంచి వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వెళ్లాలంటే 90 నుంచి 100 కిలోమీటర్లు దూరం ఉంటుంది. డీసీఎం వ్యానుకు రవాణా ఛార్జీలు కనీసం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తీసుకుం టారు. అలాగే చిట్యాల, మొగుళ్లపల్లి ప్రాంతాల నుంచి 50 కి.మీ ఉంటుంది. దాదాపు రూ.4 వేల నుంచి 5 వేల రవాణా ఖర్చులవుతాయి. చిన్న రైతులైతే టాటా ఏస్, చిన్న ట్రాలీల్లో తరలిస్తున్నారు. వీటికి కూడా రూ.3 నుంచి 5 వేల వరకు వ్యయమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఏటా కనీసం రూ.కోటి వరకు రవాణా కోసం కేటాయిస్తున్నారు. ఇలా పంట పెట్టుబడితో పాటు అదనంగా రవాణా ఖర్చులు అధికంగా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిటీలున్నా..జిల్లాలో కాటారం, చిట్యాల, భూపాలపల్లి మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి.. కానీ, ఆయా పరిధిలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు చేపట్టడం లేదు. అడ్తి వ్యాపారులను ప్రోత్సహిస్తే ఇక్కడే మంచి ధరతో విక్రయించేందుకు రైతులకు అనువుగా ఉంటుంది. వ్యాపారులకు సరైన ప్రోత్సాహకాలు లేక మార్కెట్లు అలంకార ప్రాయంగా మారాయి. మూడు మార్కెట్ కమిటీలతో పాటు జిల్లాలో 15 వేల టన్నుల సామర్థ్యం గల గోదాములు ఉన్నాయి. పంట నిల్వ చేసుకునే సౌకర్యం ఉంది. కానీ కొనుగోళ్లు చేపట్టడం లేదు.

దళారులకే మేలు..రైతుల పంట ఉత్పత్తులు దళారుల పాలవుతున్నాయి. దూరభారంతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేక మిర్చి, పత్తి, పసుపు పంటలను దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులకు మద్దతు ధర రాకపోగా తక్కువ ధరలకు అమ్ముకొని నష్టపోతున్నారు.

లైసెన్సులు పెంచితేనే..

ఉన్న మార్కెట్ల కమిటీలను బలోపేతం చేయాలి. భూపాలపల్లి, చిట్యాల కమిటీల పాలకవర్గాలను నియమించాలి. అలాగే సిబ్బందిని పెంచాలి. ముఖ్యంగా మార్కెట్ల పరిధిలో అడ్తి వ్యాపారుల వ్యవస్థను ప్రోత్సహించాలి. స్థానిక వ్యాపారులకు లైసెన్సులు ఇవ్వాలి. లైసెన్సులపై అవగాహన కల్పించాలి. మార్కెట్లలో సరైన వసతులు కల్పించాలి. ప్రస్తుతం ఉన్న మార్కెట్ల ద్వారా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకుంటే రైతులకు రవాణా ఖర్చులు మిగులుతాయి. అధికారులు మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఇక్కడే కొనుగోళ్లు జరిపితే బాగు..- పూజారి కిష్టయ్య, పంకెన, పలిమెల మండలం రెండెకరాల్లో మిరప పంట సాగు చేశాను. పంట చేతికి రాగానే అమ్ముకోవడానికి వరంగల్ ఎనుమాములకు వెళ్తాను. ఒకసారికే రవాణా ఖర్చులు రూ.7 వేలు అయ్యాయి. రెండు మూడుసార్లు వెళ్తే రూ.20 వేల వరకు అవుతున్నాయి. అందుబాటులో మార్కెట్ ఉంటే ఈ ఖర్చులు మిగిలేవి. దగ్గర్లోని కాటారం, భూపాలపల్లి మార్కెట్లలో కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

కృషి చేస్తున్నాం- కనక శేఖర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి పత్తి, మిర్చి, పసుపు, ఇతర పంట ఉత్పత్తులు కొనుగోళ్లు చేపట్టేందుకు వ్యాపారులకు లైసెన్సులు ఇస్తున్నాం. స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. మార్కెట్ల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

# ఉమ్మడి కుటుంబాలకు ‘ఉపాధి’ కష్టాలు

జనగామ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులో ఎంత మంది ఉన్నా ఒక కార్డుకు వంద రోజుల పనే కల్పిస్తుండటంతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో ఉమ్మడి కుటుంబంగా ఉండి, వివాహానంతరం వేరుగా ఉంటున్నామని, కొత్త జాబ్ కార్డు మంజూరు చేయాలని చాలా మంది కూలీలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక కార్డులో నలుగురు లేదా ఐదుగురు కుటుంబ సభ్యులున్నా వంద రోజులే పని కల్పిస్తుండటంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త జాబ్‌కార్డులు ఎప్పుడిస్తారో...ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 30-35వేల మంది ఉపాధి హామీ పనులకు హాజరవుతుండగా..వచ్చే మే నెల నాటికి 80వేల నుంచి లక్ష పైచిలుకు కూలీలు హాజరయ్యే అవకాశముంది. ఒక జాబ్‌కార్డుపై ఎక్కువ మంది సభ్యులున్న పక్షంలో వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణిస్తూ వంద రోజుల పని దినాల లక్ష్యంతో హాజరు వేస్తున్నారు. దీంతో మూడు నుంచి నాలుగు వారాల్లోనే వంద రోజుల పని దినాలు ముగిసిపోతున్నాయి. ఆ తర్వాత వారంతా ఖాళీగా ఉంటున్నారు. ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్త జాబ్ కార్డు పొందాల్సిన వారు పాత కార్డుని తొలగించుకోవాల్సి ఉంటుంది. దీనికై ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, కార్యదర్శి జారీ చేసిన పత్రాలను ఏపీవో ద్వారా జిల్లా స్థాయి అధికారికి పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో కూలీలు పనులకు దూరమవుతున్నారు.కొత్త కార్డులను మంజూరు చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారు.కూలీ తక్కువే..ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలీ రూ.257 ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి రూ.272 వరకు పెంచింది. ప్రస్తుతం రోజుకు రూ.150 వరకే వేతనం వస్తోందని వారు వాపోతున్నారు. ఇటు తక్కువ వేతనం, అటు పని దినాలు తగ్గి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేస్తున్న చిత్రాలను తీసి పంపించడంలో సాంకేతిక సమస్యలు, ఎండ తీవ్రత పెరగడం, తక్కువ వేతనం ఇస్తుండటంతో చాలా మంది కూలీలు పనులకు రావడం లేదు.

# సమస్యలపై పట్టింపేదీ?

జగిత్యాల : కొంతకాలంగా జగిత్యాల పురపాలన పూర్తిగా గాడితప్పింది. ఇన్‌ఛార్జుల మూలంగా దీర్ఘకాలికంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. కార్యాలయంలో పౌర సేవాపత్రం సక్రమంగా అమలు కావడంలేదు. అధికారులు, కిందిస్థాయి సిబ్బందిలో జవాబుదారీతనం లోపించడంతో దరఖాస్తుదారులు తమ అవసరాల కోసం కార్యలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. పాలకవర్గంలో అధ్యక్షుడు మొదలు కమిషనర్ సైతం ఇన్‌ఛార్జులుగానే వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రగతి కుంటుపడింది.

వీటికి పరిష్కారమేదీ..?

పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్త సేకరణ సక్రమంగా చేపట్టకపోవడంతో ఫిర్యాదులు పెరిగాయి. మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం విస్తరిస్తోంది. దోమల మందు(ఫాగింగ్) చేపట్టడంలేదు. యంత్రాలున్నా మూలన పడేశారు. రూ.45 లక్షల స్వీపింగ్ యంత్రం సైతం షెడ్డుకే పరిమితమైంది. పట్టణంలో కుక్కలు, పందులు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. చిన్నారులు, మహిళలు గాయాలబారిన పడుతున్నా అధికారులు



చర్యలు చేపట్టడంలేదు. మిషన్ భగీరథ పనులు ఇంకా కొలిక్కి రావడంలేదు. పనులతో రహదారులు అధ్వానంగా మారాయి.

అక్రమాల జోరు.. బల్దియా కార్యాలయంలో దళారుల దందా కొనసాగుతోంది. భవన నిర్మాణ అనుమతుల నుంచి మ్యుటేషన్లు, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, అసెస్‌మెంట్లు ఇలా అన్నింట్లోనూ అక్రమాలు పెరిగాయి. అసెస్‌మెంట్లలో ఏకంగా గత కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కాపీలు రూపొందించడం గమనార్హం. పలు విభాగాల్లో కిందిస్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. కొందరు కంప్యూటర్ సిబ్బందితో కుమ్మక్కై ట్రేడ్ లైసెన్స్ పేరిట అక్రమాలకు తెరలేపారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో పట్టణంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

# మొక్కజొన్న రైతులకు ‘మద్దతు’

వరంగల్ : పడిపోతున్న ధరలతో దిగాలు చెందుతున్న మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. మార్క్‌ఫెడ్ ద్వారా పంటను సేకరించాలని గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు, కేంద్రాలను తెరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారుల వెల్లడించారు. క్వింటా రూ.1,962 చెల్లించి కొనుగోలు చేయనున్నారు. మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేయకపోవడంతో ఈ ఏడాది అదే పరిస్థితి ఉంటుందని రైతులు ముందుగానే బహిరంగ మార్కెట్‌లో పంటను విక్రయించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సగానికి కన్నా ఎక్కువ పంట వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,05,761 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. వరంగల్ జిల్లాలో 45,395 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఎనుమాముల మార్కెట్‌లో ఈ ఏడాది జనవరి లో మొక్కజొన్న గరిష్ఠంగా క్వింటా



ధర రూ.2,450 పలికింది. క్రమంగా ధరలు పతనమవుతూ శుక్రవారం మార్కెట్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.1,734 వచ్చింది. ఎక్కువస్థాయిలో గరిష్ఠ ధరతో పోల్చితే రూ.200 నుంచి రూ.300 తక్కువ ధర చెల్లించి వ్యాపారులు పంటను కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మార్క్‌ఫెడ్ రాకతో పెరగనున్న పోటీ

బహిరంగ మార్కెట్‌లో గతేడాది మొక్కజొన్న పంటకు మద్దతు ధరను మించి క్వింటా సరాసరి రూ.2,500 పలకడంతో.. జిల్లాలో ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం పెరిగింది. సీజన్ ప్రారంభంలోనే క్వింటా రూ.2 వేలకు మించి ధరలు గతేడాది మాదిరిగానే రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో పంట చేతికి వచ్చే సమయంలో ఎగుమతులు పడిపోయాయని, తేమ, నాసిరకం తదితర కొర్రీలతో వ్యాపారులు క్రమంగా ధరలను తగ్గించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లోకి మార్క్‌ఫెడ్ ప్రవేశించడంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు మద్దతు ధరకు మించి లాభాలు వచ్చే అవకాశముంది. ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు వరంగల్ జిల్లాలో 20 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ డి.మహేశ్‌కుమార్ తెలిపారు.క్వింటా రూ.1,524కు కొనుగోలు చేశారు.- జాటోతు వెంకన్న, అరిపిరాల, తొర్రూరుఈ ఏడాది 1.30 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. పంట పెట్టుబడి, కూలీలకు కలిపి మొత్తం రూ.30 వేల వరకు ఖర్చుయ్యింది. పంటను మార్కెట్‌కు తీసుకొస్తే.. క్వింటా రూ.1,524 ధర చెల్లించారు. ఆన్‌లైన్ వేలం అంటూ వ్యాపారులు సిండికేట్‌గా మారి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో నష్టపోతున్నాం.

# యథేచ్ఛగా దళారులు దందా..!

ఖమ్మం : ఖమ్మం పాస్‌పోర్టు కార్యాలయానికి పని నిమిత్తం తండ్రితో కలిసి ఓ యువతి వచ్చారు. గమనించిన ఓ దళారి.. నకలు ప్రతులు సక్రమంగా లేవని, సాయం చేస్తానని నమ్మబలికాడు. మోసాన్ని అంచనా వేసిన యువతి తండ్రి వారించారు. తర్వాత ఇదేం తీరు అంటూ పాస్‌పోర్టు కార్యాలయం సిబ్బందిపై ఆగ్రహించారు. ఈ పరిణామానికి సిబ్బంది అవాక్కయ్యారు. కార్యాలయం బయట జరిగే వ్యవహారాలకు తమను బాధ్యులను చేయడమేంటని వాపోయారు. అక్రమాలకు తావివ్వకుండా పారదర్శక సేవలు అందించాలనే ఉద్దేశంతో ఖమ్మం పాస్‌పోర్టు కార్యాలయం వద్ద కొన్ని నెలలుగా ఇద్దరు పోలీసులను ఉన్నతాధికారులు నియమించారు. అయితే ఇదే సమయంలో దళారుల బెడద అధికమయ్యిందనే వాదనలూ వ్యక్తమవుతున్నాయి. కార్యాలయం ప్రాంగణంలోకి చొరబడి అక్కడికి వచ్చిన వారిని దళారులు తమ వెంట తీసుకెళ్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారనే



ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తపాలా కార్యాలయంలో సదుపాయం ఉన్నా..

ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం భవనంలోనే పాస్‌పోర్టు విభాగం కొనసాగుతోంది. ఇదే కార్యాలయంలో కామన్ సర్వీస్ సెంటర్ అనే కౌంటర్‌ను గతంలో ప్రారంభించారు. కొన్నాళ్లకు సిబ్బంది కొరత అంటూ కౌంటర్‌ను మూసేశారు. ఈ కేంద్రం అందుబాటులో ఉంటే కేవలం రూ.60 ఖర్చుతో పాస్‌పోర్టు ముందస్తు నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. తపాలా శాఖ ఉదాసీనత వల్ల వినియోగదారులు ఇదే పని కోసం రూ.400- 600 వరకు దళారులకు చెల్లించుకుంటున్నారు. కామన్ సర్వీస్ సెంటర్‌లోని సేవలు వివిధ రూపాల్లో ఇదే శాఖ నుంచి అందుతున్నాయి. సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో కొంత జాప్యం జరిగింది. చాలామంది ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని నేరుగా పాస్‌పోర్టు కోసం వస్తున్నారు. పాస్‌పోర్టు ముందస్తు నమోదు ప్రక్రియ, ఇతర ముఖ్య సేవలను దృష్టిలో ఉంచుకొని సీఎస్‌సీ కౌంటర్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకొస్తాం. రవికుమార్, తపాలా అధికారి, ఖమ్మం

# హరితహారం.. ప్రణాళిక సిద్ధం



ఖమ్మం : హరితహారం కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువ కట్టలపై మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. రానున్న వానాకాలంలో జిల్లాలోని సాగర్ కాలువలు, చెరువు కట్టలు, వైరా, లంకాసాగర్, పాలేరు ప్రాజెక్టుల కాలువ కట్టల వెంట గుర్తించిన ప్రదేశాల్లో మొక్కలు నాటనున్నారు. జిల్లావ్యాప్తంగా 1.48 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించి హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(ఇంజినీర్ ఇన్ ఛీఫ్)కు పంపించారు. సాగర్ కాలువలపై వాహనాల రాకపోకలకు వీలుగా దారి వదిలేసి కాలువ దిగువ ప్రాంతంలో మొక్కలు నాటనున్నారు.

లైనర్ ప్లాంటేషన్: ఎన్నెస్పీ ప్రధాన కాలువ, నందిగామ(16, 17) బ్రాంచి కాలువ, బోనకల్లు, మధిర బ్రాంచి కాలువలు, మంగాపురం మేజర్ వైరా, రాపల్లి సహా పలు మేజర్ కాలువలు, వైరా, లంకాసాగర్, పాలేరు పాత కాలువ కట్టల పక్కన 225 కి.మీ. పొడవున 91 వేల మొక్కలు నాటనున్నారు.

బ్లాక్ ప్లాంటేషన్: నీటిపారుదల శాఖకు చెందిన ఖాళీ స్థలాలు, ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు, వైరా, కల్లూరు, మధిర, ఏన్కూరు సహా పలు ప్రదేశాల్లోని మొక్కలు నాటేందుకు 23 ఎకరాల ఖాళీ స్థలాలు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో 45 వేల మొక్కలు నాటుతారు.

స్పాయిల్ బ్యాంక్ ప్లాంటేషన్: కాలువలు, చెరువులు, ఎత్తిపోతలు, బావులు తవ్వినప్పుడు వచ్చిన మట్టిని ఎత్తుగా గుట్టలుగా పోస్తారు. అలాంటి ఎత్తైన ప్రదేశాలు 10 ఎకరాలను గుర్తించారు. ఇక్కడ 12 వేల మొక్కలు నాటనున్నారు.

1.48 లక్షల మొక్కలు నాటుతాం

తేజావత్ వెంకట్రామ్,జల వనరుల శాఖ అధికారి, ఖమ్మం

వచ్చే వానాకాలంలో హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. కలెక్టర్, ఈఎన్‌సీ, సీఈ సూచనల మేరకు గుర్తించిన ప్రదేశాల్లో 1.48 లక్షల మొక్కలు నాటేందుకు నిర్ణయించాం. గత ఏడాది 3.50 లక్షల మొక్కలు నాటాం. వీటిని నాటేందుకు ముందస్తు ఏర్పాట్లను ఆయా డివిజన్ల ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# కదలని దస్త్రాలు..!

వరంగల్ : గ్రేటర్ వరంగల్‌కు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. పౌరసేవల్లో జాప్యం జరుగుతోంది. సిటిజన్ ఛార్టర్ నిబంధనలు అమలు చేయడం లేదు. కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో వందల సంఖ్యలో దస్త్రాలు పేరుకుపోయాయి. వింగ్ అధికారులు, ఉద్యోగుల పనితీరుపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడిగే వారు లేరని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల తరుపున ప్రశ్నించాల్సిన బల్దియా పాలకవర్గం మౌనంగా ఉంటుంది. కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి తీరుతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీఎస్-బీపాస్ భవన నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్లు, ఆస్తి పేరు మార్పిడి తదితర 60 నుంచి 70 దస్త్రాలు తొక్కి పెట్టినట్లుగా తెలిసింది. కొన్ని అర్జీలు కారణాలు చెప్పకుండానే తిరస్కరిస్తున్నారని, అధికారి పనితీరుపై ఫిర్యాదులు కూడా వచ్చాయి. కిందిస్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన అధికారే ఇందుకు విరుద్ధంగా పనిచేయడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కొందరు




కార్పొరేటర్లు ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రావీణ్యను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉదాహరణలు.. కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో టీఎస్-బీపాస్ భవన నిర్మాణ అనుమతి ఫైనల్ వెరిఫికేషన్ ఫైల్‌పై సంతకం చేయాలంటే రూ.1000 ఇవ్వాల్సిందే. అందరికి ఇస్తారు, నాకెందుకు ఇవ్వరని ఉన్నతాధికారి బహిరంగంగానే డబ్బులు అడుగుతున్నారని తెలిసింది. ఆరెపల్లి విలీన గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కొత్త ఇంటి నంబరుకు దరఖాస్తు చేశారు. ఆర్ఐ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఉన్నతాధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ధర్మారం, గొర్రెకుంట, వసంతాపూర్, బొల్లికుంట, కీర్తినగర్‌కు సంబంధించిన పన్నుల విభాగంలో ఆస్తిపేరు మార్పిడి దస్త్రాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు. అడిగితే వెబ్‌సైటులో సాంకేతిక లోపమని చెబుతున్నారు. తిమ్మాపూర్ విలీన గ్రామంలో ఓ సర్వేనంబరు స్థలంలో ఇప్పటికే ఐదు భవన నిర్మాణ అనుమతులు ఇచ్చారు. ఆరో దరఖాస్తును ఆపేశారు. లింకు డాక్యుమెంటు సరిగా లేదని కొర్రీలు పెట్టినట్లు సమాచారం. దేశాయిపేట, లేబర్ కాలనీ, రంగశాయిపేట, కరీమాబాద్, గిర్మాజిపేట ప్రాంతాలకు చెందిన టీఎస్-బీపాస్ ద్వారా వచ్చిన ఫైనల్ వెరిఫికేషన్ పేరుతో ఆరు దస్త్రాలు ఆపేశారని తెలిసింది.

# పుష్కరం గడిచినా.. పూర్తవ్వని పునర్నిర్మాణం

ములుగు : రామప్ప ఉప ఆలయమైన కామేశ్వరాలయం పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. శిథిలావస్థకు చేరిన ఆలయ విడి భాగాలను వేరు చేసి దశాబ్దం గడిచిపోయింది. ఇప్పటివరకు వాటిని పట్టించుకున్న వారు లేరు. కాకతీయులు రామప్ప ఆలయంతో పాటు అదే ప్రాంగణంలో కాటేశ్వర, కామేశ్వరాలయాలను నిర్మించారు. కాటేశ్వరాలయాన్ని గతంలోనే పునర్నిర్మించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న కామేశ్వరాలయం(నాట్యమండపం, కల్యాణ మండపం)ను 2011లో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో బాగు చేసేందుకు విప్పారు. విడి భాగాలను ఆలయ ప్రాంగణంలోనే ఉంచారు. అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ శిథిలమవుతున్నాయి. రామప్పను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన సమయంలో యునెస్కో ప్రతినిధులు కామేశ్వరాలయ నిర్మాణానికి గడువు విధించారు. గత డిసెంబరులో ఆలయ పునాది వద్ద భూగర్భ పరిస్థితిపై పరిశీలించారు. ఇంకా పనులు చేపట్టలేదు.

గడువుపై స్పష్టత కరవు..

2010లో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో కామేశ్వరాలయ రాతి శిల్పాలకు మార్కింగ్ చేశారు. 2011లో అప్పటి పురావస్తుశాఖ సూపరింటెండెంట్ కృష్ణయ్య ఆధ్వర్యంలో భూమి పూజ చేసి ఆలయాన్ని విప్పడం మొదలు పెట్టారు. విడిభాగాలను ఆలయ పరిసరాల్లో ఒక మూలన పెట్టారు. పునాది భాగం మాత్రం తొలగించకుండా



ఆపివేశారు. 2019లో యునెస్కో ప్రతినిధి వాసుపోశ్య నందన పరిశీలన కోసం వచ్చిన సమయంలో ఎప్పటి వరకు నిర్మాణ పనులు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పునాది పనులను తొలగించేందుకు, అంతర్భాగ పరిశీలన కోసం, ఆకృతుల కోసం.. ఇలా ఒక్కో పనికి సంబంధించి గడువులు కోరినట్లు తెలుస్తోంది. నిర్దిష్టమైన గడువు మాత్రం పురావస్తుశాఖ అధికారులు చెప్పడం లేదు.

చెదిరిపోతున్న గుర్తులు..

గుడిని విప్పే సమయంలో ప్రతి శిల్పానికి గుర్తులు వేశారు. ఒక్కో ప్రదేశంలోని ఒక్కో శిల్పానికి సంబంధించి మూడు, నాలుగు అక్షరాలతో కూడిన నంబర్లు వేశారు. వాటిని తరలించే క్రమంలో కొన్ని, పెయింటింగ్ వేసిన గుర్తులు ఎండకు ఎండి, వానకు తడిసిపోవడం వల్ల మరికొన్ని చెదిరిపోతున్నాయి. దాంతో ఆలయ నిర్మాణం ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని, నిర్మాణ పనులు మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల కొరత సాకుతో..

ఇటీవల పునాది తొలగింపు పనులు చేపట్టారు. అనంతరం నిపుణులైన నిట్ ప్రొఫెసర్ల సమక్షంలో ఆలయ భూభాగంలోని నలుదిశలా డ్రిల్లింగ్ చేసి పరీక్షలు నిర్వహించారు. అంతర్భాగంలో ఎంత మేరకు ఇసుక నింపారు. ఇతర టెక్నాలజీ ఏమైనా వాడారా అనే కోణంలో ఆరా తీశారు. కేవలం సాండ్‌బాక్స్ టెక్నాలజీ వాడినట్లు తేలడంతో నిపుణుల చేత డిజైన్స్ వేయించారు. డిజైన్స్ వేసి ఆరు నెలలు గడుస్తున్నా నిధుల కొరత పేరుతో పనులు చేపట్టడం లేదు.

# ఎర్త్‌పైపులను ఎత్తుకెళ్తున్నారు



ఖమ్మం : జిల్లాలో విద్యుత్తు ఎర్త్ పైపుల దొంగతనాలు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. నియంత్రికల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఎర్త్ పైపులు విద్యుత్తు ప్రమాదాలను నివారిస్తాయి. వీటి చోరీల కారణంగా పశువులు, మనుషులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో..21 మండలాల్లో సుమారు 28,500 విద్యుత్తు నియంత్రికలున్నాయి. వీటి ద్వారా గృహ, వ్యవసాయ విద్యుత్తు సరఫరా అవుతోంది. ఒక నియంత్రికకు రెండు, మూడు ఎర్త్ పైపులు ఏర్పాటు చేస్తారు. అన్‌బ్యాలెన్సింగ్ కరెంట్‌ను భూమిలోకి పంపేందుకు, ఓల్టేజీలో హెచ్చుతగ్గులను నియంత్రించేందుకు ఇవి దోహదపడతాయి. ఇటీవల నియంత్రికల ఎర్త్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. ఇవి లేని చోట్ల ఎర్త్ వైర్లను తాకి పశువులు మృత్యువాత పడుతున్నాయి. మనుషులు ప్రాణాపాయానికి గురవుతున్నారు. నియంత్రికలు, మోటార్లు కాలిపోతున్నాయి.

ఎక్కడికెళ్తున్నాయ్..?

ఈ పైపులు పెద్దగా విలువైనవి కాకున్నా కొందరు చోరీ చేస్తుండటం గమనార్హం. ముఖ్యంగా ఖమ్మం గ్రామీణ మండలంలో అత్యధికంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిని ఎక్కడ విక్రయిస్తున్నారనే దానిపై విద్యుత్తు ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. కొందరు వీటిని రీసైక్లింగ్ చేసే పనినే ప్రధాన వృత్తిగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అంటే చోరీ చేసిన వాటినే తిరిగి సంస్థ ద్వారా నియంత్రికల వద్ద ఏర్పాటుకు పంపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలాల వారీగా..ఏడాది వ్యవధిలో కొణిజర్లలో 23, రఘునాథపాలెం- 9, తల్లాడ- 8, ఖమ్మం గ్రామీణం- 103, తిరుమలాయపాలెం- 26, కూసుమంచి- 43, నేలకొండపల్లి- 40, ముదిగొండలో 45 ఎర్త్‌పైపుల చోరీలు జరిగాయని అధికారులు చెబుతున్నారు. నియంత్రికల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నా, చోరీలు జరిగిన వెంటనే స్థానిక అధికారులు, పోలీసు స్టేషన్‌కు సమాచారమివ్వాలి. ఖమ్మం కంట్రోల్ రూం నంబర్ 94408 11525 ను సంప్రదించవచ్చు. చోరీలను అరికట్టి విద్యుత్తు ప్రమాదాలను నివారించగలుగుతాం. ఎ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

# నిఘా నేత్రాలకు చత్వారం

వరంగల్ : ఒక సీసీ కెమెరా వందమంది రక్షకభటులతో సమానమంటూ పోలీసు అధికారులు చెప్పడం వింటూనే ఉంటాం. ఆసియాలోనే విస్తీర్ణంలో రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని సీసీ కెమెరాలకు మాత్రం ఈ సూత్రం వర్తించదు. మార్కెట్‌లో నిఘానేత్రాలకు చత్వారం సోకింది. ఏజెన్సీ నిర్వహణ లోపం, అధికారుల పర్యవేక్షణ వైఫల్యం వెరసి గత మూడేళ్లుగా సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. నేర నియంత్రణలో వీటి ఆవశ్యకత తెలిసి కూడా అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. నిరంతరం మానిటరింగ్ చేసే కంప్యూటర్ల గదికి తాళం వేసి ఉండడం, మార్కెట్లో నిఘానేత్ర వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతోంది. సీసీ కెమెరాల ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం మూడేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతోనే పర్యవేక్షించడం లేదని చెబుతున్నారు. ఈ ఏడాది మిర్చి సీజన్ ప్రారంభంలో అధికారులు ఏజెన్సీ నిర్వాహకుడికి రూ.30వేలు చెల్లించి, మిర్చి యార్డులోని 18 సీసీ కెమెరాలకు మాత్రమే మరమ్మతులు చేయించారు. మిగతా వాటిని గాలికొదిలేశారు.

కెమెరాల తీరు తెలిసే దొంగతనాలు

సీజన్‌లో పదుల సంఖ్యలో మిర్చి బస్తాలు మాయమవడం మార్కెట్‌లో సర్వసాధారణమైంది. ప్రస్తుతం మిర్చి గరిష్ఠ ధర పలకడంతో ఒక్క బస్తాపోయినా రూ.వేలల్లో రైతు నష్టపోయే ప్రమాదముంది. ఇటీవల



కొందరు రైతులు, వ్యాపారుల బస్తాలు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. సీసీ కెమెరాల పనితీరు తెలిసే దొంగలు వారి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది అపరాల యార్డులో భద్రపరిచిన పాడీ క్లీనర్లలోని 9 మోటార్లు కనిపించకపోవడంతో.. పోలీసులు కెమెరాలను పరిశీలించారు. చాలావరకు పనిచేయకపోవడంతో దొంగలను పట్టుకోలేకపోయారు. పార్కింగ్ చేసిన వాహనాలు సైతం మాయమవుతున్నా.. అధికారులు మాత్రం వీటిపై దృష్టిసారించడంలేదు.

రూ.కోట్ల ఆదాయం..

పత్తి, మిర్చి, వేరుశనగ, పసుపు, ఇతర ఆహారధాన్యాలకు సంబంధించి నిత్యం రూ.లక్షల్లో క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఏటా ఫీజు రూపంలో సుమారు రూ.30 నుంచి రూ.40 కోట్ల మేర ఆదాయం సమకూరుతుంది. పత్తి, మిర్చి సీజన్‌లో మార్కెట్‌లో అనుకోని ఘటనలు, దొంగతనాలు జరిగితే పరిశీలనకు సీసీ కెమెరాలు అవసరమవుతాయి. 117 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఉన్న మార్కెట్‌లో 2017లో 60 సీసీ కెమెరాలను ఏర్పాటుచేయగా, అందులో చాలావరకు పనిచేయడంలేదు. విస్తీర్ణం దృష్ట్యా సుమారు వందకు పైగా ఏర్పాటు చేస్తేనే విస్తృతమైన నిఘా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

మార్కెటింగ్ శాఖకు నివేదించాం: -బి.రాహుల్, మార్కెట్ కార్యదర్శి

90 కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.24 లక్షలతో మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు మంజూరయ్యే అవకాశముంది. చాలావరకు సాంకేతిక సమస్యతో పనిచేయడంలేదు. వాటిని తొలగించి కొత్తవాటిని బిగిస్తాం. ఇకపై ప్రైవేటు ఏజెన్సీలకు బదులు మార్కెట్ కమిటీ నిర్వహణ బాధ్యతను పర్యవేక్షిస్తుంది.

# సీతారామా.. పరిహారం అందేనా..?

ఖమ్మం : జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పరిహారం అందని ద్రాక్షగానే మారింది. సాగునీరొస్తే తమ పొలాల్లో సిరులు పండటమే కాకుండా.. మిగతా రైతులకూ ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో భూముల్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అప్పగించినా నిర్వాసితులకు కష్టాలు తప్పటం లేదు.

మూడేళ్లుగా ఎదురుచూపులే

ప్రాజెక్టు నిర్మాణానికి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7 వేల ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ప్రాంతాలను బట్టి భూముల విలువను లెక్కగట్టింది. కొన్నిచోట్ల ఎకరాకు రూ.8 లక్షలు, మరికొన్నిచోట్ల రూ.12 లక్షల వరకు పరిహారాన్ని ఖరారు చేసింది. భద్రాద్రి జిల్లాలో 1,000 ఎకరాలకు రూ.85 కోట్లు, ఖమ్మం జిల్లాలో 2 వేల ఎకరాలకు రూ.385 కోట్ల పరిహారం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. జూలురుపాడు మండలం పాపకొల్లు నుంచి పాలేరు లింకు కాల్వ మొదలవుతుంది. ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి మండలాల మీదుగా మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల గుండా మళ్లీ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోకి చేరుతుంది. దీన్ని కూసుమంచి మండలం పాలేరు జలాశయానికి అనుసంధానించాల్సి ఉంటుంది. ప్రధాన కాల్వ తవ్వకానికి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 2,605.46 ఎకరాలకు 2,416.22 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. 757.43 ఎకరాలకు సంబంధించి రైతులకు రూ.124 కోట్ల పరిహారం అందింది. మరో రూ.385 కోట్లు చెల్లించాలి. సత్తుపల్లి, పాలేరు ట్రంకు కెనాల్స్ పరిధిలో భూములిచ్చిన రైతులు మూడేళ్లుగా పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నారు.

16 ప్యాకేజీలుగా పనుల విభజన

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 6 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 1.12 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో రూ.15వేల కోట్ల అంచనాతో ప్రభుత్వం సీతారామ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించింది. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం నుంచి జూలూరుపాడు మండలం వరకు 1 నుంచి 8 ప్యాకేజీలు, సత్తుపల్లి ట్రంకుగా 9 నుంచి 12 ప్యాకేజీలు, పాలేరు ట్రంకు కెనాల్‌గా 13 నుంచి 16వ ప్యాకేజీ పనులు చేపట్టింది. భద్రాద్రి జిల్లాలో ప్రధాన కాల్వ 99 శాతం, మూడు పంప్‌హౌజ్‌ల



పనులు పూర్తయ్యాయి. సత్తుపల్లి, పాలేరు ట్రంకు పనులు కొనసాగుతున్నాయి.

బుగ్గపాడులో నాలుగున్నర ఎకరాల భూమిని 'సీతారామ' కాల్వ కోసం ఇచ్చాను. ఎకరాకు రూ.10.50 లక్షల చొప్పున పరిహారమిస్తామని చెప్పారు. మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా ఒక్క రూపాయి కూడా అందలేదు. మా జీవనాధారమైన భూమిని ప్రాజెక్టు కోసం ఇచ్చి ఇబ్బందులు పడుతున్నాం.

కీసరి కృష్ణ, బుగ్గపాడు, ఖమ్మం జిల్లా

యాతాలకుంటలో మాకు ఐదెకరాల భూమి ఉండగా రెండెకరాలు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి పోయింది. కాల్వ పనులు సాగుతున్నాయి. ఎకరాకు రూ.10.50 లక్షల చొప్పున పరిహారం అందాలి. రెండేళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం.

ముడియం సుశీల, యాతాలకుంట, ఖమ్మం జిల్లా

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. ఖమ్మం జిల్లాకు రూ.385 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదలవగానే నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం. శంకర్‌నాయక్, సీఈ, జలవనరుల శాఖ, ఖమ్మం

# ఆరోగ్య యోగం.. ఆర్థిక బలోపేతం!

ములుగు : వీధి వ్యాపారుల కుటుంబ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారి ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. కరోనా వ్యాప్తి సమయంలో వీధి వ్యాపారుల దయనీయ జీవితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. వీరిని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రుణాలు అందించింది. తాజాగా వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని అర్హత ఆధారంగా స్వనిధి నుంచి సమృద్ధి వైపు మళ్లించేందుకు శ్రీకారం చుట్టింది. అందుకు ఆర్థిక, సామాజిక, అక్షరాస్యత, నైపుణ్యపరమైన వివరాలు సేకరించేందుకు ప్రత్యేకంగా సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పీఎం స్వనిధిసే సమృద్ధి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని చిరు వ్యాపారులకు చేకూరనున్న ప్రయోజనాలపై కథనం..పథకం కింద రాష్ట్రంలో తొలి విడతగా తొమ్మిది పట్టణాలను ఎంపిక చేయగా.. అందులో ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ తొలి విడతగా ఎంపికైంది. అనంతరం రెండో విడతలో రాష్ట్రంలోని 31 పట్టణాలను ఎంపిక చేయగా.. అందులో ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, భైంసా, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, నస్పూరు పురపాలికలను ఎంపిక చేశారు. మెప్మా ఆధ్వర్యంలో సర్వే చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపాలిటీలో మహిళ సంఘాల ప్రతినిధులు(ఆర్పీలకు) ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. మొదటి విడత రూ.10 వేల రుణాలు తీసుకున్న నమోదిత చిరు వ్యాపారుల కుటుంబ సభ్యులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రధానంగా వైద్య ఆరోగ్య, కార్మికశాఖ, మహిళ సంక్షేమశాఖ, పౌరసరఫరాల శాఖ, బ్యాంకర్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు బీమా పథకాలు వర్తింపజేయడంతోపాటు వారు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్యాంకు రుణాలు అందించనున్నారు.

ఎనిమిది రకాల ప్రయోజనాలు

ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా ఇప్పటికే తొలి విడత ప్రయోజనం పొందిన కుటుంబాల్లో అర్హత ఆధారంగా స్వనిధి నుంచి సమృద్ధి వైపు నడిపించేలా కేంద్ర ప్రభుత్వం ఎనిమిది రకాల ప్రయోజనాలు కల్పించాలని సంకల్పించింది. పీఎం సురక్షణ బీమా యోజన, భవన నిర్మాణ కార్మిక నమోదు, పీఎం జీవన్‌జ్యోతి బీమా, వన్ నేషన్ వన్ రేషన్, పీఎం శ్రమ్‌యోగి మంధన, మాతృవందన యోజన, జననీ సంరక్షణ యోజన, జన్‌ధన్ యోజన వంటి పథకాల ద్వారా ఆదుకోనుంది.

# పట్టణం కోరుతోంది.. ప్రగతి చూపండి!

డోర్నకల్ : నా పరిధిలో ప్రగతి పండగ ప్రారంభిస్తున్నారని తెలిసి చాలా సంతోషిస్తున్నారు. ఎప్పటి నుంచో నాలో దాచుకున్న కొన్ని భావాలను మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను..

రాష్ట్రంలోని 46 శాతం జనాభా పట్టణాల్లో నివసిస్తున్నట్లు మా మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇది 50 శాతం దాటడానికి మరెన్నో రోజులు పట్టదన్నారు. అంటే పల్లెలతో పాటు పట్టణాలూ బాగుపడాలి.. ఇందుకు 'పట్టణ ప్రగతి' వేదికగా నిలవాలి.. అభివృద్ధిని చూపెట్టడానికి ఇదే సరైన సమయం. నన్ను సుందరంగా, శుభ్రంగా తీర్చదిద్దడం కోసం ప్రభుత్వం పది అంశాల్ని ప్రామాణికంగా తీసుకుంది. మాటలతో సరిపెట్టకుండా ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నా..

మరిన్ని..రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి పొదలు తొలగించండి. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచండి. రహదారులను బాగు చేయండి. ఫాగింగ్ నిరంతర ప్రక్రియ కావాలి. సిమెంటు విద్యుత్తు స్తంభాలు అమర్చండి. వీటన్నింటికితోడు ఇంటింటికి నీటి కుళాయి, నా సంపూర్ణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన, ఘన వ్యర్థాల నిర్వహణకు బయో మైనింగ్ విధానం, మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రాలు, తాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి కేంద్రీకరిస్తే అభివృద్ధిలో మేము మరింత మెరుస్తాం.



పట్టణ ప్రకృతి వనాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. సాయంత్రం వేళ సేద తీరుదామని వచ్చిన ప్రజలు పచ్చదనం కనుమరుగైందంటూ నన్ను విమర్శిస్తున్నారు.

పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అనేక చోట్ల 20-30 ఏళ్ల కిందట నిర్మించిన కాల్వలు శిథిలమై మురుగు పేరుకుపోతోంది.

నా చెంత ఉన్న వైకుంఠధామాల్లో మౌలిక వసతుల్లేవు. నీటి సదుపాయం లేదు. వీటిని బాగు చేసి పుణ్యం కట్టుకోవాలి.

సమీకృత మార్కెట్లన్నారు. ఇప్పుడు వాటి పత్తా లేదు. కూరగాయల మార్కెట్లకు శాశ్వత నిర్మాణాల్లేవు. వీటి నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించాలి.

నాలో ఇముడ్చుకున్న విలీన గ్రామాలు, గిరిజన తండాల వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. వీటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే అభివృద్ధి దిశగా అడుగులు పడతాయనేది నా ఆశ

పలు చోట్ల డంపింగ్ యార్డుల సమస్య ఉంది. సేకరించిన చెత్తను ఎక్కడ పారేయాలో తెలియక సిబ్బంది హైరానా పడుతున్నారు.

మొక్కలు నాటుతున్నా వాటి పెంపకంపై దృష్టి పెట్టడం లేదు.

పార్కులు, ఓపెన్ జిమ్‌లు, ఆట స్థలాల్లేక ఆహ్లాదం, వ్యాయామం కొరవడింది. సుందరీకరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

# జిల్లాలో ఈ-నామ్




ఖమ్మం : జిల్లాలో విస్తీర్ణంలో, ఆదాయంలో బూర్గంపాడు వ్యవసాయ విపణి అతి పెద్దది. ఏడాదికి దీని ఆదాయం రూ.4 కోట్లు. బూర్గంపాడు తరవాత కొత్తగూడెం మార్కెట్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆదాయం ఏడాదికి రూ.2 కోట్లకు పైగానే ఉంటుంది. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఈ-నామ్) పూర్తి స్థాయిలో అమలైతే రైతులకు ఎంతో ప్రయోజనం. ఆ ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం 2016లో దేశవ్యాప్తంగా ఈ-నామ్ విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఏడాది పొడవునా కార్యకలాపాలు సాగించే కొన్ని సెలక్షన్ గ్రేడ్ వ్యవసాయ విపణుల్లోనే ప్రస్తుతం ఈ విధానం అమలవుతోంది. అదీ అంతంతమాత్రంగానే. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం వ్యవసాయ విపణిలోనే ఈ-నామ్ ఉంది. ఇక భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, చర్ల, దమ్మపేటలో మార్కెట్లున్నా ఎక్కడా లేదు. అన్నీ ప్రత్యేక గ్రేడ్-1 విపణులైనా స్థానిక వ్యాపారులే పంట ఉత్పత్తులను ఇష్టం వచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

లి ఈ-నామ్ పద్ధతిలో స్థానికంగా ఉన్న వ్యవసాయ మార్కెట్లు దేశవ్యాప్త విపణులతో అనుసంధానమవుతాయి. రైతులు తెచ్చిన పంటల ఉత్పత్తులను గ్రేడింగ్ చేసి వాటి చిత్రాలు, దృశ్యాలను అంతర్జాలంలో పెడతారు. గ్రేడింగ్‌తో వాటి నాణ్యత, తీరుతెన్నులు ఇట్టే తెలిసిపోతాయి. వాటిని చూసి ఇతర రాష్ట్రాల్లోని వ్యాపారులు కొనుగోలుకు పోటీపడతారు. తద్వారా రైతులకు ఆశించిన దానికంటే మంచి ధరలు లభించే అవకాశం ఉంటుంది.

రెండు సౌలభ్యాలుంటేనే.. ఏదైనా ఓ వ్యవసాయ మార్కెట్‌లో ఈ-నామ్ అమలుకు రెండు సౌలభ్యాలుండాలి. ముఖ్యంగా అక్కడకు అన్ని రకాలా పంటల ఉత్పత్తులు రావాలి. అంటే దాని పరిధిలోని గ్రామాల్లో రైతులు ఒకే రకం కాకుండా వివిధ రకాల పంటలను పండించాలి. జిల్లాలో కొంతకాలంగా రైతులు కేవలం వరి, పత్తి, మిరప పంటలనే అధికంగా పండిస్తున్నారు. అవే పోటెత్తుతున్నాయి. ఆ క్రమంలో వ్యవసాయ విపణులు కూడా పూర్వ ప్రాభవాన్ని కోల్పోయాయి. ఈనామ్ ఏర్పాటుకు రెండో నిబంధన లైసెన్సులు కలిగిన ట్రేడర్లు ఉండాలి.

ఆ వెసులుబాటు ఎక్కడుంది?

జిల్లాలో కొత్తగూడెం, బూర్గంపాడు వ్యవసాయ విపణుల పరిధిలో లైసెన్సుడ్ ట్రేడర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటల ఉత్పత్తులను నేటికీ రైతులు కొత్తగూడెం వ్యవసాయ విపణికి తీసుకెళుతుంటారు. కొత్తగూడెంలో ఈ-నామ్ అమలు విషయమై కలెక్టర్ పరిశీలనలు జరుపుతున్నారు. బూర్గంపాడులో కూడా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రకాల పంటలను పండించేలా ప్రోత్సహిస్తున్నారు. అన్ని మండలాల్లో ఇటీవల రైతులతో సమావేశాలను నిర్వహించారు. "కొత్తగూడెం, బూర్గంపాడు వ్యవసాయ విపణుల్లో ఈ-నామ్ అమల్లోకి తెచ్చే విషయమై కలెక్టర్ పరిశీలన జరుపుతున్నారు. ఈ విధానం రావాలంటే వివిధ రకాల పంటల ఉత్పత్తులు మార్కెట్లకు రావాలి. మరోవైపు లైసెన్సులు కలిగిన ట్రేడర్లు కూడా ఉండాలి. అప్పుడే సాధ్యమవుతుంది." - నిర్మల, కార్యదర్శి, బూర్గంపాడు వ్యవసాయ విపణి

# కస్తూర్బాలో ప్రవేశాలకు వేళాయే



ఖమ్మం : చదవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది బాలికలు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. అలాంటి వారిలో అనాథ, పేద బాలికలకు కస్తూర్బా విద్యాలయాలు వరంగా మారాయి. వారి చదువులకు భరోసా కల్పిస్తున్నాయి. దీంతో ఇప్పుడు చాలా మంది తల్లిదండ్రులు కేజీబీవీల్లో తమ బాలికలను చేర్పించేందుకు ముందుకొస్తున్నారు. పదో తరగతి తర్వాత బాలికలు చదువు మానేస్తారనే ఉద్దేశంతో గత కొన్నేళ్ల నుంచి ఇంటర్మీడియట్ కోర్సులకు సైతం కస్తూర్బాలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ లాంటి ప్రధాన కోర్సులతో పాటు సీఈసీ, వృత్తి విద్యా కోర్సు అయిన ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును ప్రవేశపెట్టింది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ ప్రవేశాల కోసం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని కొంత మంది అవగాహన లేక వీటిలో చేరలేక పోతున్నారు. 'బడి-బాట'లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నిర్ణయించారు. కస్తూర్బాల్లో విద్యతోపాటు విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి, పౌష్టికాహారం, సమ దుస్తులు, కాస్మొటిక్ కిట్లు, దుప్పట్లు అందజేస్తారు. వేసవిలో కరాటే శిక్షణతో పాటు ఆంగ్లభాష, బృంద చర్చలు, నృత్యాలు, చిత్రలేఖనం, యోగా, స్వయం ఉపాధి కోర్సులు, కంప్యూటర్ విద్య, బాలికా సాధికారత క్లబ్బుల ఏర్పాటు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు విద్యాలయంలోనే అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలు దీటుగా ప్రభుత్వం వీటిని అన్ని విధాలా తీర్చిదిద్దుతోంది. జిల్లాలో కేజీబీవీలు: బోనకల్లు, చింతకాని, ఏన్కూరు, కామేపల్లి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, కొణిజర్ల, కూసుమంచి, ముదిగొండ, పెనుబల్లి, రఘునాథపాలెం, సింగరేణి, తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం. కేజీబీవీల్లో బాలికలకు పూర్తిగా రక్షణ కల్పిస్తున్నాం. అన్ని విద్యాసంస్థల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లోని వివిధ కోర్సుల్లో చేరేందుకు ఖాళీలున్నాయి. బాలికలు తమ సమీపంలోని కేజీబీవీల్లో సంప్రదించి ఖాళీ సీట్లలో ప్రవేశం పొందాలి. దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రవేశాలు పెంచేందుకు ఆయా ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. - ఉదయశ్రీ, జీసీడీవో, ఖమ్మం

# శ్రమ జీవుల యాతన

ఖమ్మం :ఉపాధి హామీ పథకంలో కేంద్రం సమూల మార్పులు చేసింది. గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్‌ను మార్చి నూతన ప్రక్రియను చేపట్టింది. దీంతో కూలీలకు కొత్త తలనొప్పి మొదలైంది. ఎండలో రెక్కలు ముక్కలు చేసుకుని చేసిన పనికి కష్టార్జితం ఖాతాలో పడుతుందిలే అనుకున్నారు. బ్యాంకుకు వెళ్లి చూస్తే అందులో నగదు జమ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే ఇంతవరకు ఉపాధి డబ్బులు ఏమీ పడలేదని చెప్పడంతో కూలీలు ఆందోళనకు గురవుతున్నారు. ఉపాధి సిబ్బందిని అడిగితే సాఫ్ట్‌వేర్ మారిందని వేరే బ్యాంకు ఖాతా తెరిచి ఇవ్వాలంటున్నారు.

వేలల్లో ఖాతాలు తెరవాలి ఉపాధి పథకం ప్రారంభంలో కూలీలు ఖాతాలు తెరిచి వాటిని అధికారులకు అందజేశారు. ఆ తరవాత ఎక్కువ మంది పనులకు రావడంతో కొన్ని రోజులు పోస్టాఫీసు, మరికొన్ని బ్యాంకు ద్వారా నగదును అందించారు. తరవాత నేరుగా కూలీల ఖాతాల్లోకి వేస్తుండటంతో తీసుకోవడం తేలికైంది. అలాకూడా చాలామంది కూలీలకు సక్రమంగా నగదు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కేంద్రం ఉపాధి పథకం సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా మార్చింది. దాని ప్రకారం పనులు గుర్తించడం దగ్గర నుంచి వేతనం అందేవరకు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ ప్రక్రియలోనే చాలామంది ఖాతాలు జాబ్‌కార్డుకు అనుసంధానం కాకపోవడంతో నిలిచిపోయాయి. 2006లో జాబ్‌కార్డులకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలు మాత్రమే ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తమయ్యాయి. 2014 నుంచి కొత్తగా నమోదైన కూలీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలన్నీ నిలిచిపోయాయి. కొత్త పంచాయతీల్లో ఈ సమస్య అధికంగా ఉండి



కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ ఖాతాలు తెరిచి ఇస్తేగాని వేతనం పడే అవకాశం లేదు.

అంతా గందరగోళం.. నూతన సాఫ్ట్‌వేర్‌తో కొత్త పంచాయతీ ప్రజలకు పాత ఖాతాల్లో డబ్బులు జమకావడం లేదు. కొత్త అకౌంట్లు తెరవడానికి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి ఖాతాలు బ్లాక్ కావడంతో కొత్తవి తెరిస్తేనే డబ్బులు జమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు చేసిన పనికి సంబంధించిన వేతనం ఎందులో జమవుతుందో తెలియటం లేదు. ప్రస్తుతం పోస్టాఫీసుల్లో అకౌంట్ తెరవాలని అధికారులు చెప్పడంతో కూలీలు అక్కడకు పరుగులు తీస్తున్నారు. ఒక ఫోన్ నంబర్ ద్వారా ఒక అకౌంట్ మాత్రమే తెరవడానికి వీలుంటుంది. పేదల ఇంట్లో ఒకటే ఫోన్ ఉంటుంది. దీంతో ఖాతాలు తెరవడానికి ఫోన్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేసిన పనికి డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియదుకానీ ప్రస్తుతం తమకు ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# భాష రాదు.. బోధన అర్థం కాదు

ములుగు : రెండేళ్ల కరోనా కాలంలో విద్యార్థుల సామర్థ్యాలు పూర్తిగా దిగజారాయి. సగానికిపైగా విద్యార్థులు భాషపైనా పట్టు కోల్పోయారు. నిత్య జీవితంతో ముడిపడి ఉన్న సైన్సులో, గణితంలో కనీస సామర్థ్యాలకు దిగువన ఉండటం విద్యార్థుల ప్రతిభాపాటవాలకు అద్దం పడుతోంది. ఆరు మాసాల కిందట కేంద్ర మానవ వనరుల శాఖ నిర్వహించిన జాతీయ సాధన సర్వే(న్యాస్) ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. కరోనా విద్యార్థుల చదువులపై తీవ్రప్రభావం చూపిందని సర్వే తేటతెల్లం చేసింది.

విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా కిందటి నవంబరు 12న నేషనల్ అచివ్‌మెంట్ సర్వే(న్యాస్)ను నిర్వహించింది. ఇందులో భాగంగా జిల్లాలోనూ 170 పాఠశాలల్లో డైట్ ఛాత్రోపాధ్యాయులు విద్యార్థులకు నిర్దేశిత అంశాల్లో సర్వే చేపట్టారు. చదువుతో పాటు కొవిడ్ సమయంలో కొత్తగా ఏం నేర్చుకున్నారు. ఎలా గడిపారనే దానిపైనా ప్రశ్నలు వేశారు. విద్యార్థులు చదువులో వెనకబడినట్లు కనిపించినా ఇతర అంశాలపై సమాధానాలను ఉత్సాహంగా చెప్పినట్లు సర్వే నివేదికలు చెబుతున్నాయి.

వంట నేర్చుకొని.. ఉల్లాసంగా గడిపి

సర్వేలో 37 శాతం మంది బాలికలు వంట నేర్చుకున్నామని చెప్పగా.. 55 శాతం మంది విద్యార్థులు తల్లిదండ్రులు, బామ్మ, తాతయ్య,



తోబుట్టువులతో కలిసి ఉల్లాసంగా గడిపినట్లు తెలపడం విశేషం. ఇండోర్‌గేమ్‌లతో 49 శాతం మంది, 47 శాతం మంది పెయింటింగ్, నృత్యం, సంగీతం, పాటలు నేర్చుకోగా, 40 శాతం యోగా చేసినట్లు వివరించారు.

అట్టడుగున.. విద్యార్థుల కనీస సామర్థ్యాలు మాత్రం అట్టడుగున నిలిచాయి. మూడు, అయిదు తరగతుల విద్యార్థులే కాదు ఎనిమిది, పదో తరగతి విద్యార్థులు ఆయా అంశాల్లో కనీస సామర్థ్యాలను ప్రదర్శించలేకపోయారు. సైన్సు, సోషల్‌లో 80 శాతానికిపైగా విద్యార్థులు కనీస సామర్థ్యాలకు దిగువన ఉండటం ఆందోళనపరిచే అంశం. ఆంగ్లంలో ఒకరిద్దరు విద్యార్థులు ఉండాల్సిన ప్రతిభ కంటే ఎక్కువ కలిగి ఉండటం కొసమెరుపు.

సర్వే జరిగిందిలా..మొత్తం పాఠశాలలు : 170 (ప్రభుత్వ పాఠశాలలు : 52 శాతం, ప్రైవేటు పాఠశాలలు : 48 శాతం) పాల్గొన్న విద్యార్థులు : 4,143 మందిసర్వే చేసినవారు : 619 మంది

సర్వే చేసిన తరగతులు : 3, 5, 8, 10వ తరగతి విద్యార్థుల శాతం : బాలికలు: 51.70 శాతం, బాలురు : 48.30 శాతం గ్రామీణప్రాంత విద్యార్థులు : 61 శాతం, పట్టణప్రాంత విద్యార్థులు : 39 శాతం

# పల్లెప్రగతి.. ఉత్తమ పంచాయతీలే స్ఫూర్తి

ములుగు : ఐదో విడత పల్లె ప్రగతికి కార్యక్రమానికి వేళయింది. నేటి నుంచి గ్రామాల్లో పల్లెప్రగతి కార్యక్రమాలతో సందడి నెలకొననుంది. ఈ పరిస్థితుల్లో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లెలు ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే నాలుగు విడతలుగా పల్లె ప్రగతి కార్యక్రమం జరగగా జిల్లాలోని పలు పంచాయతీలు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాలను తీర్చిదిద్దుకుని ఉత్తమంగా నిలిచాయి. పురస్కారాలు అందుకున్నాయి. జిల్లాలోని మిగిలిన గ్రామాలు ఉత్తమ పంచాయతీలను స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. సకల సౌకర్యాలు, పచ్చని చెట్లు, పరిశుభ్రమైన వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

సమష్టి కృషితో అభివృద్ధి

వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామం గతేడాది పల్లెప్రగతి పనుల్లో ముందంజలో నిలిచి జిల్లా ఉత్తమ పంచాయతీగా అవార్డు అందుకుంది. సర్పంచి మందల సుచరిత ఆధ్వర్యంలో గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు సమష్టిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. పల్లె ప్రగతిలో చేపట్టిన పనులతో పాటు నిత్యం పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనుల్లో అలసత్వం ప్రదర్శించలేదు. పల్లె ప్రకృతి వనంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం తీరొక్క మొక్కలను నాటి చూపరులను ఆకట్టుకున్నారు. శ్మశానవాటికను ఏర్పాటు చేసి వినియోగంలోకి



తీసుకువచ్చారు. గ్రామ నర్సరీలో మొక్కలు పెంచి రోడ్లకు ఇరువైపులా నాటి వాటిని సంరక్షిస్తున్నారు. రైతు వేదిక, బతుకమ్మ విగ్రహం ఇతర నిర్మాణాలు పూర్తి చేశారు. సర్పంచి సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, లేకుంటే జరిమానా విధిస్తామని చెప్పారు. దీంతో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అధికారుల నుంచి ప్రశంసలతో పాటు ప్రత్యేక నిధులను అందుకుని మరింత అభివృద్ధికి నాంది పలికారు.

ఆదర్శ గ్రామం.. జంగాలపల్లి

ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామం జిల్లా స్థాయిలో రెండు సార్లు ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. పల్లెప్రగతి పనుల్లో భాగంగా శ్మశానవాటిక వద్ద నీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాలు కల్పించారు. పల్లె ప్రకృతివనాలు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా చేపడుతున్నారు. రోజువారీ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనులు చేపడుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో పల్లెప్రగతి అభివృద్ధి నివేదికను ప్రజలందరికీ కనబడే విధంగా శాశ్వతంగా ఒక బోర్డును ఏర్పాటు చేశారు.




## పాక ఇడ్లీ తిన్న వెంకయ్యనాయుడు.. అశ్చర్యపోయిన యజమాని

విజయవాడ: నగరంలోని మున్సిపల్ ఎంప్లాయూస్ కాలనీ SSS ఇడ్లీ సెంటర్ (పాక ఇడ్లీ)లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు టిఫిన్ చేశారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావుతో కలిసి వెంకయ్య నాయుడు నేతి ఇడ్లీ తిన్నారు. ఈ ఇడ్లీ తినేందుకే గన్నవరం నుంచి ప్రత్యేకంగా వెంకయ్యనాయుడు విజయవాడ వచ్చారు. నాణ్యమైన ఇడ్లీ అందిస్తున్నారని హోటల్ యజమాని కృష్ణ ప్రసాద్‌ను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... పాక ఇడ్లీ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. గతంలో ఎప్పుడో ఒక్కసారి ఇక్కడ ఇడ్లీ తిన్నానని గుర్తుచేశారు. నాణ్యమైన ఇడ్లీ తినాలనిపించి ఇక్కడకు వచ్చానని పేర్కొన్నారు. సంప్రదాయ వంటలనే ఆహారపు అలవాట్లుగా మార్చుకోవాలని సూచించారు. పిజ్జా, బర్గర్లు ద్వారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని చెప్పారు. యువతకు కూడా మన వంటకాల రుచులను చూపించి అలవాటు చేయాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. అమ్మ చేతి ముద్ద ఎప్పుడూ అమృతమేనన్నారు. అలాగే మన సంప్రదాయ వంటలే మనకు బలమన్నారు. వ్యాయామం మనకి ఎంత ముఖ్యమో మన వంటలే తినడం అంతే ముఖ్యమని తెలిపారు. తాను ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయనన్నారు. అలాగే పాక ఇడ్లీ యజమాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... నలభై యేళ్లుగా ఇక్కడ ఇడ్లీ సెంటర్‌ను నడుపుతున్నామని తెలిపారు. "మా నాన్న. మల్లికార్జున రావు ఈ హోటల్‌ను స్థాపించారు. పాక ఇడ్లీగా ప్రసిద్ధి చెందడంతో ప్రముఖులు కూడా వస్తుంటారు. ఈరోజు వెంకయ్య నాయుడు తమ హోటల్‌లో టిఫిన్ చేయడం ఆనందంగా ఉంది. హఠాత్తుగా రావడంతో మేము కూడా ఆశ్చర్య పోయాం" అని పేర్కొన్నారు.




విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి సునంద తెలిపారు. పశ్చిమ విదర్భ నుంచి కర్ణాటక వరకు ద్రోణి ప్రభావం కొనసాగుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలతో పాటు, కొన్ని చోట్లు భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు విస్తాయని సునంద తెలిపారు. మంగళవారం పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిసింది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. తీవ్రమైన ఎండలు మండే మే నెలలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రమంతా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి అనేక జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, నంద్యాల, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## 'మాది రైతుల ప్రభుత్వం.. వారికి సీఎం జగన్ అండగా ఉంటారు'

నెల్లూరు: ఏపీ వ్యాప్తంగా అకాల వర్షాలు కురుస్తుంటే, పంట నష్ట నివారణ చర్యలపై కొన్ని తోక పత్రికలు ఇష్టమొచ్చినట్లు కథనాలు రాస్తున్నాయని, ఇదంతా చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లోనే జరుగుతోందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. పంట నష్ట నివారణ చర్యలపై ఇప్పటికే అధికారులను ఆదేశించామని, వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారన్నారు. అకాల వర్షాలు, పంటనష్ట నివారణ చర్యలపై 'సాక్షి'తో మాట్లాడిన మంత్రి కాకాణి.. ' రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల నుంచి అకాల వర్షాలు కురుస్తున్నాయి.పంట నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాము. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

అన్ని చోట్లా వర్షాలు తగ్గిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. తడిచిన ధాన్యాన్ని గింజ కూడా వదలకుండా కొనుగోలు చేస్తాం.ప్రతిపక్షాల అనవసర విమర్శలు పట్టించుకోవలసిన అవసరం



లేదు.చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనాడు , కొని తోక పత్రికలు పని చేస్తున్నాయి.మాది రైతుల ప్రభుత్వం.. వారికి అండగా సీఎం వైఎస్ జగన్ ఉంటారు.- పంట నష్టపోయిన రైతులకు ఆ సీజన్ లోనే పరిహారం అందిస్తున్న ఘనత మా ప్రభుత్వానిది' అని తెలిపారు.

## ఆ మూడు సంతకాలు గుర్తుచేసిన కోటంరెడ్డి

నెల్లూరు: జిల్లాలో రూరల్ సమస్యలపై సీఎం జగన్ మూడు సంతకాలు చేశారని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గుర్తుచేశారు. ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని, సీఎం పెట్టిన సంతకాలే



దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారం కావన్న వైసీపీ నేతలు... ముందుకొచ్చి నిధులు మంజూరు చేయించండని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. అధికారానికి దూరమైనా ఆరోగ్యకరమైన రాజకీయాలు చేస్తానని తెలిపారు.

## చంద్రబాబు తిరుపతి పర్యటన తేదీలు మార్పు

అమరావతి: తిరుపతి జిల్లాలో ఈనెల 2, 3, 4తేదీల్లో జరగాల్సిన టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన రెండు రోజుల పాటు వాయిదా పడింది. వర్షాల కారణంగా తిరుపతి జిల్లాలో చంద్రబాబు



పర్యటన ఈనెల 4, 5, 6 తేదీలకు మార్చినట్లు పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపారు. 4న సూళ్లూరుపేట, 5న గూడూరు, 6న వెంకటగిరి నియోజకవర్గాల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొననున్నారు.

## ఆంక్షలు కాదు.. ఆకాంక్షల ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం: నారా లోకేష్

ఏపీలో ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆంక్షలతో పాలన చేస్తోందని.. ఎవరు బయటకు రావాలి.. ఎవరు రాకూడదు.. ఎవరికి స్వేచ్ఛ ఉండాలి.. ఎవరికి ఉండకూడదో కూడా నిర్ణయిస్తోందని.. టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ మండిపడ్డారు. తాము అదికారంలోకి వచ్చిన తర్వాత.. ఆంక్షలు కాదు.. ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం యువగళం పాదయాత్రలో ఉన్న నారా లోకేష్.. ఎమ్మిగనూరులో జోరు వానలోనూ.. యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపాలిటీలు పంచాయితీలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిన జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కొత్తగా పెన్షన్లు ఇవ్వడం చేతగాక కుంటిసాకులతో ఉన్న పెన్షన్లు తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6లక్షల పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం తొలగించిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అర్హులైనవారికి ఆంక్షలు లేకుండా పెన్షన్లు అందిస్తామన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం పాడుబెడుతోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్దిదారులకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. రకరకాల పన్నులతో జగన్ రెడ్డి పట్టణ వాసుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే పన్నుల విధానాన్ని సమీక్షించి సామాన్యులపై భారం తగ్గిస్తామని లోకేష్



హామీ ఇచ్చారు. ఇవన్నీ ఆంక్షలు కావా? అని నారా లోకేష్ ప్రశ్నించారు. తమ హయాంలో ఇలాంటి ఆంక్షలు లేవన్నారు. ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించే పరిస్థితి ప్రస్తుత వైసీపీ హయాంలో లేకుండా పోయిందని.. భయ పడుతూ బతుకుతున్నారనిఅన్నారు. టీడీపీ హయాంలో అందరూ స్వేచ్ఛగా జీవించారని.. తిరిగి అలాంటి ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు.




గుజరాత్‌కు చెందిన అమూల్‌పై వల్లమాలిన ప్రేమ కనబరుస్తున్న జగన్ ప్రభుత్వం.. తాజాగా అంగన్ వాడీలకు పాల సరఫరా కోసం అధిక ధర చెల్లించేందుకూ సిద్ధమైంది. ఇప్పటి వరకు కర్ణాటకకు చెందిన నందిని డెయిరీ ద్వారా పాల సరఫరా జరుగుతుండగా.. ఇప్పుడు అందులో కొంతమేర అమూల్ ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించింది. అది కూడా నందిని డెయిరీ సరఫరా చేసే రేటు కన్నా లీటరుకు రూపాయి 25 పైసలు ఎక్కువకే. అంతటితో ఆగకుండా రవాణా ఖర్చులతో పాటు పన్నులనూ ప్రభుత్వమే భరిస్తుందంటూ మరింత ప్రేమ ఒలకబోసింది.

## 'రాజధాని లేని సీఎం జగన్'.. ఫ్లెక్సీలతో వినూత్న నిరసన!




విశాఖ రుషికొండలో జనజాగరణ సమితి కట్టిన ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారాయి. వైకాపా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంటికి వెళ్లే దారిలో 'రాజధాని లేని రాష్ట్ర ముఖ్యమంత్రికి స్వాగతం సుస్వాగతం'.. అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

జగన్‌ను ప్రధాని మోదీ సన్మానించి "క్యాపిటల్ లెస్ సీఎం" బిరుదు ఇవ్వాలని.. జన జాగరణ సమితి కన్వీనర్ వాసు ఎద్దేవా చేశారు. అమరావతిలోని రైతు కుటుంబాలను రోడ్డున పడేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విశాఖలో కాపురం పెడతానంటున్నారని ఆక్షేపించారు.




## అక్కడ జిగేల్...ఏపీలో సచివాలయం ఎక్కడ....?

అమరావతి : ఉమ్మడి ఏపీ విడిపోయాక తెలంగాణాకు ఏపీకి కలిపి పదేళ్ల పాటు పాత సచివాలయాన్నే విభజన చట్టం మేరకు వాడుకునే వెసులుబాటు ఇచ్చారు. అయితే 2015లో ఓటుకు నోటు కేసు తరువాత చంద్రబాబు ఏపీకి తరలి వచ్చేశారు. ఆనాడు ఆయన ఏపీకి టెంపరరీ అంటూ సచివాలయం నిర్మించారు. అది 2016లో జరిగింది. ఆ సచివాలయంతో పాటు అసెంబ్లీ శాశనమండలి కూడా ఉంటుంది. ఇందుకోసం అప్పట్లో ఏకంగా వేయి కోట్ల రూపాయలు వెచ్చించారు. ఇంత చేసినా నాలుగైదు బ్లాకులతో పరిమితంగా ఉంది ఏపీ సచివాలయం. గతంలో చంద్రబాబు సీఎం గా ఉన్నపుడు అక్కడ హడావుడి ఉండేది. జగన్ అమరావతిని రాజధానిగా కాకుండా మూడు రాజధానులు అంటూ కొత్త నినాదం అందుకోవడంతో సచివాలయం ప్రభ మసకబారింది. అసెంబ్లీ ఉన్నపుడు మంత్రి వర్గ సమావేశాల సందర్భంగా మాత్రమే ఏపీ తాత్కాలిక సచివాలయం పనిచేస్తుంది. ఆ మీదట అక్కడ ఏమీ ఉండదు. జగన్ అయితే గత నాలుగేళ్లుగా తాడేపల్లిలోని తన నివాసంలోని క్యాంప్ ఆఫీసునే సమీక్షలకు కేంద్రంగా మార్చేశారు. అక్కడితే అధికారులు మంత్రులు వస్తారు. మిగిలిన వారు కూడా సచివాలయానికి పోవడంలేదు. దాంతో సచివాలయం పూర్తిగా కళ తప్పిపోయి ఉంది. ఒక విధంగా రాజధాని లేదు సచివాలయం లేదు అన్నట్లుగా పరిస్థితి ఉంది. అదే తెలంగాణా లో తీసుకుంటే పాత సచివాలయాన్ని కూలగొట్టి కొత్తగా కట్టి జిగెల్మనిపించేల నిర్మించారు. దాని ఖర్చు కూడా దాదాపుగా పన్నెండు వందల కోట్లు. కానీ ఎన్నో సదుపాయాలతోనో దాన్ని నిర్మించారు. ఆరు అంతస్తులతో కట్టారు. ఈ కొత్త సెక్రేటేరియట్ లో ఏకంగా 635 గదులు ఉన్నాయి. అలాగే నాలుగు వైపుల నుంచి ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. పటిష్టమైన అయిదు ఐదు అంచెల భద్రతా వ్యవస్థ ఉంది. ఇక అత్యాధునికంగా దీన్ని నిర్మించారు. 265 అడుగుల ఎత్తు ఉన్న సచివాలయాన్ని భూకంపాలను తట్టుకునేలా నిర్మించారు.ప్రత్యేక హెలిప్యాడ్ కూడా ఉంది. రూఫ్ టాప్లో స్కై లాంజ్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఒక్క మాటగా చెప్పుకోవాలీ అంటే దేశంలోనే టాప్ గా తెలంగాణా సచివాలయం ఉంది అని అంటున్నారు. ముఖ్యమంత్రి ఆరవ అంతస్తులో ఉంటారు. అలాగే ఈ సచివాలయంలో పూర్తిగా వర్చువల్ విధానంలో రివ్యూస్ చేసుకునే ఏర్పాటు చేశారు. దేశంలో ఎక్కడ ఏమి జరిగినా నేరుగా సమీక్షించే సదుపాయం దీని సొంతం. అలాంటి అద్భుతాన్ని కేసీయార్ అక్కడ ఆవిష్కరిస్తే ఏపీలో మాత్రం రాజధని ఎక్కడో తెలియదు సచివాలయం అంతకంటే సందడి లేక కళావిహీనంగా ఉంది. మరి విభజన జరిగి తొమ్మిదేళ్ళు అవుతునన ఏపీకి ఏమిటీ దుస్థితి అన్నదే అందరి బాధ ఆవేదనగా ఉంది. తెలంగాణా అన్ని విధాలుగా ముందుకు దూసుకుపోతూంటే ఏపీలో సచివాలయం టెంపరరీ అంటారు. ఆఖరుకు అది కూడా ఎక్కడా కళా కాంతులు లేకుండా చేశారు. మొత్తానికి ఏపీ ఎపుడు ఎత్తిగిల్లుతుంది. రాజధాని ఎక్కడ సచివాలయం ఎక్కడ అంటే జవాబు ఎవరు చెబుతారు మరి.




## ఉన్న విషయాలే చెప్పాను.. చంద్రబాబుపై నా అభిప్రాయం మారదు: రజనీకాంత్

అమరావతి: 'టీడీపీ అధినేత చంద్రబాబు విజనరీ' అంటూ తమిళ సూపర్‌స్టార్, తలైవర్ రజనీకాంత్ చేసిన ప్రశంసల పట్ల వైసీపీ నేతలు స్పందించిన తీరుపై ఆయన అభిమానులు రగిలిపోతున్నారు. ఎవరిపట్ల అయినా మంచిగా స్పందించే రజనీ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వైసీపీ నేతలు మాట్లాడడమేంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాలైన తిరువళ్లూరు, వేలూరు, కాంచీపురం తదితర జిల్లాలకు చెందిన అభిమానులు వైసీపీ తీరు పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 'చంద్రబాబును రజనీ పొడిగితే వీళ్లకెందుకంత బాధ' అంటూ తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబుకు రజనీకాంత్ ఫోన్ చేశారు. రజనీకాంత్‌పై వైసీపీ నేతల తీవ్ర విమర్శల పట్ల చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు విజనరీ అంటూ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలను వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. వైసీపీ నేతల విమర్శలను పట్టించుకోవద్దని రజనీకాంత్‌ను చంద్రబాబు కోరారు. "ఎవరెన్ని విమర్శలు చేసినా స్పందించబోను. ఉన్న విషయాలే చెప్పాను.. నా అభిప్రాయం మారదు. సంయమనం పాటించాలని అభిమాన సంఘాలకు చెప్పాను" అని రజనీకాంత్, చంద్రబాబుతో అన్నారు. వైసీపీ నేతలు తన పట్ల పెట్రేగిపోతున్నా రజనీ మాత్రం నోరు మెదపకపోవడం గమనార్హం. అయితే ఆది నుంచి రజనీ తీరే అంత అని ఆయన గురించి బాగా తెలిసిన సీనియర్లు చెబుతున్నారు. నటి జయలలిత తొలిసారి ముఖ్యమంత్రి పదవిని అధిరోహించినప్పుడు పోయెస్ గార్డెన్‌లో ఆమె నివాసానికి సమీపంలో ఉన్న రజనీ ఇంటి వద్ద అన్నాడీఎంకే నేతలు హడావుడి చేసేవారు. కనీసం రజనీ కుటుంబీకులు బయటకు వచ్చివెళ్లేందుకు కూడా అవకాశం లేకపోయేది. ఈ వ్యవహారం కాస్తా ముదరడంతో రజనీని ఉద్దేశపూర్వకంగానే అప్పట్లో జయలలిత ప్రభుత్వం ఇబ్బందుల పాల్జేసింది. నిజానికి డీఎంకే అధినేత కరుణానిధితో రజనీకి సన్నిహిత సంబంధాలున్నాయన్న కక్షతోనే నాటి ప్రభుత్వం అలా వ్యవహరించింది. అయినా రజనీ నోరు మెదపలేదు. అనంతర కాలంలో విడుదలైన 'నరసింహ' చిత్రంలోని దృశ్యాలను వీక్షించిన ప్రేక్షకులు.. వాటిని రజనీ ఉద్దేశంగా భావిస్తూ ఎవరికివారు అన్వయించుకున్నారు.

# మత్తెక్కించే చూపులకు ఎలాంటివాడైనా పడిపోవాల్సిందే..!

టిక్ టాక్ డబ్ స్మాష్ వీడియోస్ తో పాపులర్ అయ్యి ఆ క్రేజ్ తో సినిమా ఛాన్స్ అందుకుంది చెన్నై చిన్నది మృణాళిని రవి. సూపర్ డీలక్స్ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు తెలుగులో గద్దలకొండ గణేష్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా హిట్ అయినా అమ్మడికి పెద్దగా అవకాశాలు రాలేదు. బిగ్ బాస్ ఫేం సోహెల్ హీరోగా నటించిన ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు సినిమాలో హీరోయిన్ గా నటించింది మృణాళిని రవి. మరోపక్క సుధీర్ బాబు మామ మశ్చీంద్ర సినిమాలో కూడా ఛాన్స్ అందుకుంది. సుధీర్ బాబు సినిమాతో అయినా అమ్మడికి లక్ కలిసి వస్తుందేమో



చూడాలి. సినిమా అవకాశాలు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా వైట్ కలర్ షర్ట్ బ్లాక్ మిడ్డీతో అమ్మడు అదరగొట్టేసింది. తన ఓర కళ్ళతో మత్తెక్కించే చూపులకు ఎలాంటివాడైనా సరే పడిపోవాల్సిందే. అమ్మడి ఈ ఫోటో షూట్ చూసి చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే అని కామెంట్స్ పెడుతున్నారు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను కావాలని కథల విషయంలో ఆచి తూచి అడుగులేస్తున్న మృణాళిని రవి మరీ వేగం తగ్గితే అమ్మడిని మర్చిపోయే పరిస్థితి వస్తుందని గుర్తుంచుకోవాలి. సినిమాలు చేసినా చేయకపోయినా ఫోటో షూట్స్ తో మాత్రం తమ ఫ్యాన్స్ ని అలరిస్తుంటారు హీరోయిన్లు. వారి దారిలోనే మృణాళిని కూడా ఫోటో షూట్స్ తో కవ్విస్తుంది. టాలీవుడ్ లో వరుస సినిమాలు చేయాలని ఆసక్తి చూపిస్తున్న అమ్మడికి సరైన ఛాన్స్ లు రావట్లేదని చెప్పొచ్చు. హరీష్ శంకర్ లాంటి డైరెక్టర్ ఇంట్రడ్యూస్ చేసినా మృణాళిని రవికి మంచి ఛాన్స్ లు రావట్లేదు. మరి రాబోతున్న సుధీర్ సినిమా అయినా వర్క్ అవుట్ అవుతుందా అమ్మడి కెరీర్ లో జోష్ నింపుతుందా లేదా అన్నది చూడాలి.

## భూమిపైనే స్వర్గం చూపిస్తున్న బ్యూటీ

వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ ఇన్ స్టా ఎలివేషన్లలో తనకు తానే పోటీ. అమ్మడు టెంప్టింగ్ ఫోజులకు కుర్రాళ్లకు మతి చెండాల్సిందే. స్కిన్ షో..క్లివేజ్ షో...థై షో ఏదైనా సరే అందులో తనదైన మార్క్ తప్పనిసరి. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన బ్యూటీ కావడంతో తన పబ్లిసిటీ ప్లాన్ పక్కాగా ఉంటుంది. తాజాగా మరోసారి అమ్మడి అందాలు నెట్టింట దుమారం రేపుతున్నాయి. ఇదిగో ఇక్కడిలా బీచ్ రిసార్ట్ లో అగ్గి రాజేసే అందాలతో వెడెక్కిస్తుంది. జీన్స్ నిక్కర్.. వీపందం హైలైట్ అయ్యేలా డిజైన్డ్ దుస్తుల్లో మంటలు పుట్టిస్తుంది. వయ్యారంగా వెనుక వైపుగా చూస్తూ కెమెరాకి ఇచ్చిన ఫోజుకి కిక్ తప్పదు మరి. పెదాలతో పాటు కళ్లలోనూ చిన్న చిరు నవ్వును పలికిస్తుంది. ఆ సన్నని నవ్వుకు అంతే అందమైన కన్ను గీటు కూడా తోడైతే! ఆ కిక్కే వేరుగా ఉండేది. జస్ట్



మిస్ అన్ని ఒకేసారి అయితే ఎలా? అనుకుందో ఏమో! ఈసారి ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఈ ఫోటోని ఉద్దేశించి ఓ బ్యూటీఫుల్ కామెంట్ పెట్టింది. భూమిపై స్వర్గం ఉంటే ఇలాగే ఉంటుందేమో. ఇది ఎంతో మనోహరమైన అనుభవం. మాటల్లో చెప్పలేని..పెదాలతో పలకలేని సంతోషంతో మనసంతా నిండిపోయింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. అసలే బ్యూటీకి సోషల్ మీడియాలో పిచ్చ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడా నెంబర్ రెట్టింపు అవ్వడం ఖాయం. ఇటీవలే చీరందంలో తళుక్కున మెరిసింది. మోడ్రన్ దుస్తుల్లో కనిపించే వారియర్ ఒక్కసారిగా చీరందంలో కనిపించేసరికి కుర్రాళ్లంతా మరోసారి ఫిదా అయ్యారు. ఆ వెంటనే ఇలా మరోసారి మోడ్రన్ గార్ల్ గా మారిపోయింది. కెరీర్ సంగతి చూస్తే ప్రియా వారియర్ పలు సినిమాల్లో నటిస్తోంది. ఆ సినిమా ల్లో ఈ ఏడాది ఎన్ని సినిమాలు వస్తాయి అనేది చూడాలి. మలయాళంతో పాటు ఇతర భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. ఈ ఏడాది అయినా హీరోయిన్ గా సక్సస్ అవుతుందా? అన్నది చూడాలి.




# సీక్వెల్స్ కలెక్షన్స్.. దేనికెక్కువంటే.?






దక్షిణాదిన చాలా సినిమాలకు సీక్వెల్స్ వచ్చాయి. ప్రీక్వెల్స్ తో పాటు సీక్వెల్స్ కూడా సత్తా చాటాయి. వాటిలో బాహుబలి రోబో కేజీఎఫ్ పొన్నియన్ సెల్వన్ లు ఉన్నాయి. మరి వీటిలో అత్యధిక కలెక్షన్స్ రాబట్టి సినిమాలేంటి..? ప్రీక్వెల్స్ ఎక్కువ కలెక్షన్లు సాధించాయా? లేక సీక్వెల్స్ సత్తా చాటాయా? తొలిరోజు అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాలు ఏంటో ఓసారి చూద్దాం.. కోలీవుడ్ స్టార్ సీనియర్ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన భారీ బడ్జెట్ మూవీ పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 2. తమిళనాట ప్రెస్టీజియస్ గా తెరకెక్కిన పొన్నియిన్ సెల్వన్ రెండు భాగాలుగా రూపొందగా.. గతంలో పార్ట్ 1 రిలీజ్ అయ్యి బాక్సాఫీస్ దగ్గర పర్వాలేదు అనిపించుకుంది. ఇక ఇటీవల పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 2 మూవీని ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేశారు టీమ్. ఈ హిస్టారికల్ మూవీకి తమిళ ప్రేక్షకులు మాత్రమే ఎక్కువగా పట్టం కట్టారు. మిగిలిన చోట్ల పొన్నియన్ సెల్వన్ మూవీకి మిక్స్ టాక్ వస్తోంది. కానీ కలెక్షన్స్ పర్వాలేదనిపిస్తున్నాయి. మొదటి పార్ట్ తో పోలిస్తే రెండో భాగానికి కలెక్షన్స్ తగ్గాయనే చెప్పొచ్చు. పొన్నియన్ సెల్వన్ మొదటి భాగం తొలి రోజు రూ. 82.30కోట్లు వసూలు చేయగా రెండో భాగం తొలిరోజు రూ.59.12కోట్లు రాబట్టింది. ఇక శంకర్ దర్శకత్వంలో రజినీకాంత్ నటించిన రోబో సినిమా ఎంత హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రోబో మొదటి భాగం తొలిరోజు రూ.31.60 కోట్ల కలెక్షన్లు రాబట్టింది. ఇక రెండో భాగం మరిన్ని అంచనాలతో విడుదలై హిట్ కొట్టింది. అంచనాలు ఎక్కువగా ఉండటంతో కలెక్షన్లు కూడా ఎక్కువగా రాబట్టింది. రెంబో భాగం రోబో2.0 తొలిరోజు 95కోట్లు రాబట్టడం విశేషం. ఇక టాలీవుడ్ పాన్ ఇండియా సినిమా బాహుబలి క్రేజ్ దేశ వ్యాప్తంగా పాకింది. బాహుబలి మొదటి భాగం తొలిరోజు 73.40కోట్లు రాబట్టింది. ఈ మూవీ బాగా హిట్ అవ్వడంతో రెండో భాగం కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు అనే విషయం తెలుసుకోవాలనే ఆసక్తి మరింత ఎక్కువగా పెరిగింది. అందుకే రెండో భాగం మొదటి రోజు మరిన్ని కలెక్షన్స్ రాబట్టింది. తొలిరోజు రూ.215కోట్లు రావడం గమనార్హం.

ఇక కేజీఎఫ్ ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బ్లాక్ బస్టర్ అయ్యింది. తొలి భాగం తొలి రోజు రూ.23కోట్లు రాబట్టగా రెండో భాగం ఇంకా ఎక్కువ కాసుల వర్షం కురిపించింది. కేజీఎఫ్ 2 తొలిరోజు రూ.164.20కోట్లు రాబట్టింది.

# జయమాలిని..సిల్క్ స్మితని మించిపోయేలా జాన్వీకపూర్!



క్లబ్ డాన్సర్స్ గా జయమాలిని..సిల్క్ స్మిత లాంటి వారు ఎంత ఫేమస్ అయ్యారో చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు గొప్ప నర్తకిలు. ఎంత గొప్ప డాన్సర్లో అంతకు మించి వాళ్ల ఆహార్యాలు అద్భుతంగా తెర పై పండేవి. క్లబ్ డాన్సర్ అంటే ఇలాగే ఉండాలని ఓ ట్రెండ్ సృష్టించి వెళ్లిపోయారు. ఆ తర్వాత తరం నటులు వాళ్ల లెగసీని అందుకోవాలని ప్రయత్నించారు గానీ ఫలించలేదు. క్లబ్ డాన్సర్స్ గా వాళ్లిద్దరికి వచ్చినంత పేరు..గుర్తింపు ఎవరికీ రాలేదు. ఆహార్యాల పరంగానూ ఎవరూ నూరుశాతం న్యాయం చేయలేదు. మరి ఆ ఛాన్స్ అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఏమైనా తీసుకుంటుందా? వాళ్లకి పోటీ గా నేను ఉన్నాను? అంటూ బరిలోకి దిగుతుందా? అంటే అవుననే అనేలా ఉందీ సన్నివేశం. జాన్వీ కొత్త ఫోటో ఒకటిప్పుడు ఇన్ స్టాని షేక్ చేస్తుంది. అందులో జాన్వీ అచ్చంగా క్లబ్ డాన్సర్ ఆహార్యంలోనే కనిపిస్తుంది. ఓసారి ఆ ఫోటోని పరిశీలిస్తే.. మోకాళ్ల వరకూ మెరిసే నక్షత్రాల షూస్...ఆ పైన థై అందాలు ఎలివేట్ అయ్యేలా స్కట్..మ్యాచింగ్ బ్లౌజ్ లో అమ్మడు మిరుమిట్లు గొలుపుతున్న వైనం అచ్చంగా క్లబ్ డాన్సర్ నే తలపిస్తుంది. ఆ నడుము మడత..నాభి అందాలు..వగరైన చూపు అన్ని కొత్త జాన్వీని పరిచయం చేస్తున్నాయి. క్లబ్ డాన్సర్ మాదిరి ఇచ్చిన ఆ ఫోజులు కుర్రాళ్ల కు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతార్జాలంలో కాక పుట్టిస్తుంది. జాన్వీ ఆహార్యం పై రకరకాల కామెంట్లు పడుతున్నాయి. జాన్వీ ఏ సినిమా లో నైనా క్లబ్ డాన్సర్ పాత్ర పోషిస్తుందా? లేక ! ఫ్యాషన్ ఎంపికలో భాగంగా ఇలాంటి దుస్తుల్లో దూరిపోయిందా? అంటూ కామెంట్లు పెడుతున్నారు. జాన్వీ త్వరగా క్లారిటీ ఇవ్వు. లేదంటే? ఇక్కడ క్లారిటీ మిస్ అవుతుందంటూ కుర్రాళ్ల వెర్రెత్తిపోతున్నారు. ఈ బ్యూటీ యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమాతో టాలీవుడ్కి పరిచయమవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే హిందీలో లాంచ్ అయింది. అక్కడ నిలదొక్కుకుంది. దీంతో సౌత్ మార్కెట్ పై కన్నేసినట్లు తెలుస్తుంది.

# కరణ్ కంపెనీలో చేరిన తెలుగు హీరోయిన్?

రాశీ ఖన్నా చాలా కాలంగా బిగ్ స్టార్ డమ్ ఆశిస్తోంది. అగ్ర కథానాయిక హోదా కోసం పాకులాడుతోంది. తెలుగు-తమిళం-హిందీలో తనవంతు ప్రయత్నాలు చేసింది. కానీ ఎందుకనో ఆశించిన స్టార్ డమ్ తన చేతికి చిక్కలేదనే చెప్పాలి. ఇక్కడ రాశీ ఖన్నా ద్వితీయ శ్రేణి హీరోల సరసన మాత్రమే నటించగలిగింది. అరుదుగా రవితేజ తప్ప పెద్ద హీరోలెవరూ అవకాశాలివ్వలేదు. అదే క్రమంలో తమిళంలో రాణించేందుకు తీవ్రంగానే శ్రమించింది. అక్కడ కొన్ని విజయాలు ఊరటనిచ్చాయి. తన స్థాయిని పెంచుకునేందుకు ఉన్న ఏ ఒక్క మార్గాన్ని రాశీ విడిచిపెట్టడం లేదు. ఇటీవలే సమంత బాటలో వెబ్ సిరీస్ లోను నటించింది. రాజ్ అండ్ డీకే అండదండలతో ఫర్జీ వెబ్ సిరీస్ లో షాహిద్ సరసన అందాల రాశీ కనిపించింది. అమెజాన్ ప్రైమ్ లో సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో నటించిన లీడ్



పాత్రలకు మంచి గుర్తింపు దక్కింది. ఇదే ఆనందంలో రాశీఖన్నా తన స్టార్ డమ్ ని మరో లెవల్ కి తీసుకెళ్లేందుకు ప్రయత్నాల్లో ఉంది. ఈ బ్యూటీ ఇప్పుడు నటవారసురాళ్లను.. పరిశ్రమ ఇన్ సైడర్స్ ని బాధ్యతగా ప్రమోట్ చేసే కరణ్ జోహార్ తో స్నేహం చేయడం హాట్ టాపిక్ గా మారింది. కరణ్ నిర్మిస్తున్న భారీ ఎపిక్ చిత్రం యోధాలో రాశీకి ఒక కీలక పాత్రలో నటిస్తోంది. ఇంత గౌరవప్రదమైన నిర్మాణ సంస్థలో బలమైన పాత్రను పోషించే అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా ఉన్నానని కరణ్ విషయంలో కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేసింది. చీరకట్టు సొగసరిలా పల్లె పట్టు సుందరి లా నటించాల్సిన అవసరం లేకుండానే ...తాను ఈ సినిమాలో కనిపిస్తానని రాశీ ఖన్నా తాజా ఇంటర్వ్యూలో వెల్లడంచింది. సినిమా లో అనవసరమైన గ్లామర్ ఎలివేషన్ కూడా అవసరం లేదని తెలిపింది. క్లాసిక్ ధర్మ ప్రొడక్షన్ హీరోయిన్ గా తనకు గుర్తింపు దక్కినందుకు ఆనందం వ్యక్తం చేసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే...యోధాతో పాటు అర్నమై 4 లో నటిస్తోంది. దర్శకుడు పా రంజిత్- విజయ్ చిత్రంలోను నటించనుంది.

## వైట్ అండ్ టైట్ టాపులో మిల్క్ బ్యూటీ అందాలు..!

2005లో చాంద్ సా రోషన్ చెహ్రా అనే హిందీ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన మిల్క్ బ్యూటీ తమన్నా.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. అదే ఏడాది శ్రీ సినిమాతో తెలుగులో ఆ తర్వాత ఏడాది కేడీతో తమిళ ఇండస్ట్రీలోనూ అడుగు పెట్టింది. తన అందం అభినయంతో అతి తక్కువ కాలంలోనే టాప్ హీరోయిన్ గా మారిపోయింది. తన అందం అభినయం బాడీ స్ట్రక్చర్ తో తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. సూపర్ స్ట్రక్చర్ కళ్లు చెదిరే అందం శిల్పి చెక్కినట్లుగా ఒంపులు తిరిగిన శరీరంతో కుర్రాళ్లలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. అగ్ర హీరోల సరసన నటించి ఆహా అనిపించింది. 2005 నుంచి ఇప్పటి వరకు ఆమె ఇంకా స్టార్ హీరోయిన్ గానే కొనసాగుతోంది. అయితే తాజాగా ఈ క్యూట్ బ్యూటీ



ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఆమె ఎక్కడికో వెళ్లి వస్తుండగా.. ఎయిర్ పోర్టులో మీడియా కంట పడింది. దీంతో వెంటనే వాళ్లు ఫొటోలు తీయడం నెట్టింట షేర్ చేయడం... వైరల్ గా మారడం చకచకా జరిగిపోయాయి. అయితే తమన్నా ఈ ఫొటోల్లో బ్లాక్ జీన్స్ విత్ వైట్ టైట్ టాప్ వేసుకుంది. అందులో ఎద అందాలు చాలా క్లియర్ గా కనిపిస్తున్నాయి. వైట్ షూస్ విత్ బ్లాక్ కలర్ టాప్ ఓ స్లిమ్ హ్యాండ్ బ్యాగ్ వేసుకొని చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. ముద్దుగా ముద్ద బంతిలా నవ్వుతూ అందిరనీ మైమరిపిస్తోంది. ఈ ఫొటోలు చూసిన ప్రతీ ఒక్కరూ తమన్నా స్టైల్ కు స్టైల్ కు ఫిదా అయిపోతున్నారు. నీ అందం అదిరింది నిన్ను చూస్తేనే పిచ్చెక్కిపోతుంది ఈ అందం ఏంటమ్మడు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక ప్రస్తుతం తమన్నా చేతిలో ఒకటీ అర సినిమాలు తప్ప పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం తెలుగులో భోళా శంకర్ సినిమాలో చిరు సరసన నటిస్తోంది. హిందీలో పలు వెబ్ సిరీస్ లు చేస్తున్నట్లు సమాచారం. తమిళంలో సూపర్ స్టార్ రజినీ కాంత్ జైలర్ సినిమాలో కూడా తమన్నాకు ఛాన్స్ వచ్చింది. తెలుగులో రీసెంట్ గా సత్యదేవ్ తో కలిసి గుర్తుందా శీతాకాలం సినిమా చేసిన తమన్నా.. ఆ తర్వాత వేరే ప్రాజెక్టులు ఒప్పుకున్నట్లు లేదు.




# దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ: కేటీఆర్

హైదరాబాద్: ఉపాధి కల్పనతో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. సంగారెడ్డిలో ఫ్లిప్‌కార్ట్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం ఐటీసీ కాకతీయలో జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా మారుద్దామన్నారు.

ఇప్పుడు తెలంగాణ చేస్తున్నది.. రేపు యావత్ భారతదేశం ఫాలో అవుతుందని చెప్పారు. ఈ కామర్స్ రంగం వేగంగా దూసుకెళ్తోందన్నారు. ఉపాధి కల్పనలో 50 శాతం మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేటీఆర్ సూచించారు.

రాష్ట్రంలో కేవలం ఫ్లిప్‌కార్ట్ ద్వారానే సుమారు 40వేల మందికి ఉపాధి లభిస్తోందని.. ఇది గర్వకారణమన్నారు. ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇది తెలంగాణలోనే అతిపెద్ద ఫెసిలిటీ సెంటర్ అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు.



# గవర్నర్ వర్సెస్ ప్రగతిభవన్ కొత్త పంచాయితీ

హైదరాబాద్: రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య పంచాయతీ ముగిసిందని అందరూ అనుకున్నారు. గవర్నర్? తమిళి సై, సీఎం కేసీఆర్? మధ్య సయోధ్య కుదిరిందని భావించినా తాజా పరిణామాలతో విభేదాలు తెరపైకి వచ్చాయి. ఈసారి గవర్నర్? వర్సెస్ ప్రగతిభవన్ మధ్య కొత్త లొల్లి మొదలైంది. మంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపణలపై రాజ్‌భవన్ స్పందించింది. సచివాలయం ప్రారంభోత్సవానికి ఈర్ష్యతోనే గవర్నర్ రాలేదంటూ జగదీష్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. జగదీష్‌రెడ్డి విమర్శలకు గవర్నర్ తమిళిసై సమాధానమిచ్చారు. కొత్త సచివాలయం ప్రారంభోత్సవానికి ఎలాంటి ఆహ్వానం అందలేదని తెలిపారు. గవర్నర్‌కు ఆహ్వానం పంపించారనేది తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. "మాకు ఎలాంటి ఆహ్వానం అందలేదు. ఆహ్వానం రాకపోవడం వల్లే గవర్నర్ హాజరుకాలేదు" అని రాజ్‌భవన్ కార్యాలయం నోట్ రిలీజ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర అధికార పక్ష ప్రజాప్రతినిధులందరూ హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై, ప్రతిపక్ష నేతలు మాత్రం హాజరు కాలేదు. సచివాలయ ప్రారంభ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించింది. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర గవర్నర్ తమిళిసైకి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ప్రభుత్వం ఆహ్వానం పంపింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించింది. ఎమ్మెల్యేలకు ఆయా జిల్లాల అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆహ్వానాలను పంపించారు. అలాగే ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించారు. కానీ, గవర్నర్‌తో పాటు ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా గైర్హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందినా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు హాజరవడం ఆనవాయితీ. సచివాలయ నిర్మాణ విషయంలో మొదటి నుంచి ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పాత సచివాలయం బాగానే ఉందని, దాన్ని కూల్చవద్దని ప్రతిపక్ష పార్టీలు చెప్పాయి. ఇంత భారీగా ఖర్చు చేసి కొత్త సచివాలయాన్ని నిర్మించాల్సిన అవసరం లేదని విమర్శించాయి. సచివాలయ భవన నిర్మాణ నిధులతో రాష్ట్రంలో నూతనంగా ఆస్పత్రులను నిర్మించాలని ప్రతిపక్షాలు సూచించాయి. కానీ, ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో విపక్షాలు కొత్త సచివాలయ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇక గవర్నర్ తమిళిసైతో రాష్ట్ర ప్రభుత్వానికి సత్సంబంధాలు లేవు. గత కొంత కాలంగా ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలను గవర్నర్ వ్యతిరేకించారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులపైనా గవర్నర్, ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ గైర్హాజరయ్యారు.

# బీఆర్ఎస్ అంటేనే.. భారత రైతు సమితి : కేటీఆర్



రాజన్న సిరిసిల్ల : రైతులు ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు భరోసా ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గోపాలపల్లిలో క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి.. రైతులను ఓదార్చారు. అధైర్యపడొద్దని, కేసీఆర్‌పై నమ్మకం ఉంచాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు భరోసానిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అకాల వర్షాలకు రైతులు నష్టపోయారన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ స్వయంగా పంటలను పరిశీలించి, రైతులకు భరోసానిచ్చారన్నారు. వడగళ్ల వానలు రైతుల నోటోమన్నుకొట్టాయని, పుష్కలంగా నీరుండడంతో సమృద్ధిగా పంట చేతికివచ్చిందన్నారు. బీఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి అన్నారు. గ్రామీణ కష్టాలను తెలిసిన నేత కేసీఆర్ అని, ఇవాళ జలవనరులు పెరిగాయంటే కేసీఆర్ సంకల్పం వల్లే సాధ్యమైందన్నారు. రైతులకు కేసీఆర్ అండగా ఉంటారన్నారు. 19వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఎకరానికి రూ.10వేల నష్ట పరిహారం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని రైతులంతా విశ్వాసంతో ఉండాలని, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. ఇప్పటికే ఏడున్నర లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే డబ్బులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కర్ణాటక ప్రధాని నరేంద్ర మోదీ ఏ కల్చర్ వద్దని గొంతు చించుకున్నారో.. ఇప్పుడు అదే కల్చర్‌ను అవలంభిస్తున్నారని విమర్శించారు. ప్రధాని కర్ణాటకకే ప్రధానినా? మిగతా రాష్ట్రాల్లో సిలిండర్, పాలు ఎందుకు ఇవ్వరు? అంటూ విమర్శించారు. పిరమైన ప్రధానిని ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. అదానీ కొన్న ఎయిర్‌పోర్ట్‌కి జీఎస్టీ లేదు కానీ.. పాలు కొన్న సామాన్యుడికి జీఎస్టీ ఉందంటూ ఆరోపించారు.

# ఎంసెట్‌కు అదనంగా 50వేల దరఖాస్తులు: ప్రొఫెసర్ లింబాద్రి




హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్ సహా అన్ని ప్రవేశ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంసెట్‌కు ఈ ఏడాది అదనంగా 50వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటికే 2లక్షలకు పైగా విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. "ఎంసెట్‌కు 28 కొత్తవి సహా మొత్తం 137 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యమైతే అనుమతించేది లేదు. లాసెట్‌ను ఒకే రోజు మూడు సెషన్లలో నిర్వహిస్తున్నాం. ఈసెట్ ఒకే పూటలో పూర్తిచేసేలా ఏర్పాట్లు చేశాం. ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లు ప్రాసెస్‌లో ఉంది"అని చెప్పారు. జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా బయోటెక్నాలజీ కోర్సు ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు.

కొత్త కోర్సుల కోసం ప్రైవేట్ కాలేజీల దరఖాస్తులు ఏఐసీటీఈ పరిశీలనలో ఉన్నాయన్నారు. కాలేజీల్లో తనిఖీలు మరో నాలుగైదు రోజుల్లో పూర్తవుతాయని వీసీ తెలిపారు. మే 10 నుంచి 14 వరకు ఎంసెట్ అగ్రికల్చర్, ఇంజినీరింగ్ పరీక్షలు జరగనున్నాయి. మే 10, 11న అగ్రికల్చర్, మెడికల్.. 12, 13, 14 తేదీల్లో ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.




# మళ్లీ కవిత పేరు ప్రస్తావన

**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యంకేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జీషీట్లపై విచారణకు సీబీఐ కోర్టు అంగీకరించింది. అనుబంధ ఛార్జీషీట్‌లో తెలంగాణ ఎమ్మెల్సీ కవిత పేరును ప్రస్తావించిన దర్యాప్తు సంస్థ... బినామీగా అరుణ్ పిళ్లైని పెట్టి భూములు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. మద్యం సిండికేట్‌లో మాగుంట రాఘవ్ కీలకపాత్ర పోషించాడని అనుబంధ ఛార్జీషీట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించింది.**




# తిహాడ్ జైల్లో గ్యాంగ్‌స్టర్ హత్య

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తిహాడ్ జైల్లో ఖైదీల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్యాంగ్‌స్టర్ టిల్లు తాజ్‌పురియాపై ప్రత్యర్థి గ్యాంగ్ దాడి చేసి హత్యచేసింది. మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు జైలు అధికారులు వెల్లడించారు. %తిహాడ్ జైల్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో హై రిస్క్ వార్డ్‌లో ఉన్న టిల్లు అలియాస్ సునిల్ మాన్‌పై మరో గ్యాంగ్‌స్టర్ యోగేశ్ తుండా, అతడి అనుచరులు దాడి చేశారు. ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టారు. జైలు అధికారులు గమనించి దాడిని అడ్డుకున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన టిల్లును హుటాహుటిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. టిల్లు తాజ్‌పురియా.. ఢిల్లీలోని అత్యంత క్రూరమైన క్రిమినల్ గ్యాంగ్‌కు నేతృత్వం వహిస్తున్నాడు. 2015లో ఓ కేసులో అరెస్టయి అప్పటి నుంచి తిహాడ్ జైల్లో ఉంటున్నాడు. టిల్లు గ్యాంగ్‌కు ఢిల్లీకి చెందిన మరో గ్యాంగ్‌స్టర్ జితేందర్ గోగితో ఏళ్ల తరబడి శత్రుత్వం ఉంది. 2021 సెప్టెంబరులో గోగి ఢిల్లీలోని రోహిణి కోర్టులో దారుణ హత్యకు గురయ్యాడు. ఓ కేసు విచారణ నిమిత్తం అతడిని కోర్టుకు తీసుకురాగా.. అదే సమయంలో న్యాయవాదుల దుస్తుల్లో వచ్చిన ఇద్దరు టిల్లు అనుచరులు.. కోర్టు ఆవరణలోనే గోగిపై కాల్పులకు తెగబడ్డారు. దాదాపు 35 నుంచి 40 రౌండ్లు కాల్పులు జరిపారు. సినీఫక్కీలో జరిగిన ఈ దాడిలో జితేందర్ అక్కడిక్కడే మరణించాడు. ఈ కాల్పులను తిహాడ్ జైలు నుంచి టిల్లు ఫోన్‌లో పర్యవేక్షించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. రోహిణి కోర్టు ఘటనలో టిల్లు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. తాజాగా టిల్లుపై దాడి చేసిన యోగేశ్.. గోగి గ్యాంగ్‌కు చెందిన షార్ప్ షూటర్ అని తెలుస్తోంది. గోగి హత్యకు ప్రతీకారంగానే యోగేశ్.. టిల్లును హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

# యాదాద్రిలో అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం వరకు మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు ఆలయ ధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. జయంత్యుత్సవాల్లో భాగంగా సాయంత్రం 6:00 గంటలకు అంకురార్పణ, రుత్విగ్వరణం, హవనం నిర్వహించి గరుడ వాహనంపై పరవాసుదేవ అలంకార సేవను చేపట్టరు. ఈ సందర్భంగా ఈ నెల 2 నుంచి 4 వరకు సుదర్శన నారసింహహోమం, నిత్య, శాశ్వత తిరు కల్యాణోత్సవాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రధానాలయంలోని ఉత్తర రాజగోపురం వెలుపలి ప్రాకార మండపంలో యాగశాల ఏర్పాటు చేశారు. 3న 9 గంటలకు నిత్యమూలమంత్ర హవనం, కాళీయ మర్ధన అలంకార సేవలో స్వామివారిని తిరుమాఢవీధుల్లో ఊరేగించనున్నారు.

10:30 గంటలకు లక్ష పుష్పార్చనలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు నృసింహ మూలమంత్ర హవనం, హనుమంత వాహనంపై రామావతారం అలంకార సేవ ఉంటుంది. 4న 7 గంటలకు మూలమస్త్ర హవనం, ఉదయం 9.00 గంటల నుంచి 9.30 గంటల వరకు పూర్ణాహుతి అనంతరం సహస్ర కలశాభిషేకం, సాయంత్రం 7 గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించనున్నారు.

# థాయ్‌లాండ్ గ్యాంబ్లింగ్ కేసులో విచారణ వేగవంతం



హైదరాబాద్: థాయ్‌లాండ్ గ్యాంబ్లింగ్ కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో 93 మందిని థాయ్‌లాండ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్యాసినో కింగ్ చీకోటి ప్రవీణ్ థాయ్‌లాండ్‌లో అరెస్టయ్యారు. బాంగ్ లాముంగ్ జిల్లాలోని ఆసియా పట్టాయా హోటల్‌లో ఓ 4-స్టార్ హోటల్‌లో క్యాసినో, జూదం నిర్వహిస్తుండగా.. ఉప్పందుకున్న థాయ్‌లాండ్ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ చేపట్టి.. చీకోటి ప్రవీణ్, అతని అనుచరుడు మాధవరెడ్డి, మెదక్ డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి సహా 87 మంది భారతీయులను అరెస్టు చేశారు. ఇతర దేశాలకు చెందిన వారితో కలిపి మొత్తం 100 మందికి పైగా అరెస్టు చేయగా.. వీరిలో 19 మంది యువతులున్నారు. మెదక్ డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన వీఆర్ఏ వాసు, ఇసుక వ్యాపారి సాగర్, వ్యాపారవేత్తలు సుదర్శన్ రెడ్డి, భరత్ రెడ్డి, మల్లికార్జున్ రావు, మాధవరెడ్డి, బిల్డర్ మధు, వర్మ, తిరుమల్ రావు, బొమ్మిడి మధుసూదన్ అరెస్టయిన వారిలో ఉన్నారు. వీఆర్ఏ వాసుపై కేసు నమోదు కావడంతో అతడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నెలలో రెండుసార్లు చికోటి ప్రవీణ్ ఈవెంట్ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఏప్రిల్ 11 నుంచి 16 వరకు గ్యాంబ్లింగ్ నిర్వహించారు. ఏప్రిల్ 27 నుంచి మే 1 వరకు రెండోసారి గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గ్యాంబ్లింగ్‌పై థాయ్‌లాండ్ ఇంటెలిజెన్స్‌కు గోవాకు చెందిన వ్యక్తి సమాచారమిచ్చాడు. పక్కా సమాచారంతో ఏషియా హోటల్‌పై థాయ్ పోలీసులు దాడి చేశారు. ఈవెంట్ కోసం ఒక్కొక్కరి నుంచి చికోటి రూ. 3 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్యాంబ్లింగ్ నిర్వహణలో మహిళ కీలక పాత్ర పోషించినట్లు గుర్తించారు. అరెస్టయిన భారతీయుల్లో తెలంగాణకు చెందిన రాజకీయ ప్రముఖుల అనుచరులు, వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. థాయ్‌లాండ్‌లో క్యాసినో, జూదంపై నిషేధం లేదని చీకోటి ప్రవీణ్ నమ్మబలకడంతో వీరంతా రానుపోను విమాన టికెట్లు కాకుండా.. ఒక్కొక్కరు రూ. 3 లక్షలు చెల్లించి, థాయ్‌లాండ్ వెళ్లినట్లు తెలుస్తోంది. భారత్‌లో డబ్బులు చెల్లిస్తే థాయ్‌లాండ్‌లో వాటికి సమాన విలువ గల చిప్స్ ఇచ్చేలా.. ఆ తర్వాత క్యాసినో, జూదంలో గెలుపొందిన వారి నగదును భారత్‌లో భద్రంగా అప్పగించేలా చీకోటి ప్రవీణ్‌తో ఒప్పందం ఉండడంతో వీరంతా థాయ్‌లాండ్ వెళ్లినట్లు తెలిసింది. కాగా.. ఈ ఏడాది జూన్‌లో నేపాల్‌లో క్యాసినో నిర్వహించనున్నట్లు ఇప్పటికే చీకోటి గ్యాంగ్ ప్రచారం చేసుకున్నట్లు తెలిసింది. థాయ్‌లాండ్‌లో గ్యాంబ్లింగ్‌కు ఉపయోగించిన పరికరాలన్నీ భారత్ నుంచి దిగుమతి చేసుకున్నారని పోలీసులు వెల్లడించారు. నిజానికి గత నెల 24న కూడా ఓ భారతీయ బృందం హోటల్‌లో దిగిందని, వారంతా సైట్‌సీయింగ్‌కు వచ్చారని, 27న వచ్చిన బృందం మాత్రం క్యాసినో ఆడేందుకు వచ్చిందని సమాచారం.

# జూన్ 20వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ : జూన్ 20వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బల్కంపేట ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి తలసాని పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం అద్భుత పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుందని తెలిపారు. ప్రతి సంవత్సరం అమ్మవారి కళ్యాణాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం.. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో అమ్మవారి కళ్యాణాన్ని నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని స్పష్టం చేశారు. బల్కంపేట ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com